ప్రజాశక్తి

సోమవారం 27 మే 2024 | 8 పేజీలు






ప్రకాశం | బాపట్ల

స్ట్రాంగ్ రూమ్స్‌కు

మూడంచెల భద్రత

ఎస్పీ గరుడ్ సుమిత్ సునీల్




రిజిష్టర్‌లో సంతకం చేస్తున్న ఎస్పీ సునీల్

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

సార్వత్రిక ఎన్నికల సందర్భంగా ఈవిఎంలు భద్రపరచిన రైజ్ ఇంజినీరింగ్ కళాశాలలోని స్ట్రాంగ్ రూమ్స్‌కు మూడంచెల భద్రత కల్పిస్తున్నట్లు జిల్లా ఎస్‌పి గరుడ్ సుమిత్ సునీల్ పేర్కొన్నారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో రైజ్ ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద మూడంచెల భద్రతను ఆదివారం జిల్లా ఎస్‌పి తనిఖీలు నిర్వహించారు. స్ట్రాంగ్ రూమ్స్ పరిశీలించడంతో పాటు సంబంధిత రిజిస్టర్స్ లో జిల్లా ఎస్‌పి సంతకం చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్‌పి మాట్లాడుతూ ఒంగోలు పార్లమెంట్, 8 అసెంబ్లీ సెగ్మెంట్స్ కు సంబంధించి ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూముల వద్ద భద్రతా ఏర్పాట్లను నిరంతరం పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద మూడంచెల భద్రత మరియు నలువైపులా పటిష్ట బందోబస్తును ఏర్పాటు చేశామన్నారు. కౌంటింగ్ ప్రక్రియ పూర్త య్యేంతవరకు విధి నిర్వహణలో అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. నిర్లక్ష్యం లేకుండా 24 గంటలు నిరంతరం పకడ్బందీగా నిర్వహించాలని, ఏ చిన్న అవాంఛనీయ సంఘటనలకు ఆస్కారం లేకుండా సమర్ధవంతంగా విధులు నిర్వర్తించాలన్నారు. 4వ తేదిన కౌంటింగ్ దష్ట్యా ట్రాఫిక్ రెగ్యులేషన్, వాహనాల పార్కింగుకు ప్రత్యేకంగా చర్యలు చేపట్టాలని సూచించారు. కౌంటింగ్ కేంద్రాలకు విచ్చేసే వివిధ పార్టీలకు చెందిన కౌంటింగ్ ఏజంట్లు వాహనాలను ప్రత్యేకంగా నిర్ధేశించిన పార్కింగ్ ప్రాంతాలకు తరలించాలన్నారు. కౌంటింగ్ కేంద్రాలలోకి వెళ్ళే ఏజెంట్లను కుణ్ణంగా తనిఖీ చేయాలని, కళాశాల ప్రవేశ ద్వారం వద్ద విధులు నిర్వహించే పోలీసు అధికారులు, సిబ్బంది కళాశాల లోపలకి వచ్చు ప్రతి ఒక్కరిని తనిఖీ చేయాలన్నారు. వారి ▶ 2లో

ప్రలోభాలపైనే ఆశలు..!

- గెలుపుపై అదే ధీమాలో అభ్యర్థులు
- భారీ ఓటింగుకూ ఇదే కారణమనే విశ్లేషణలు



ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

రాష్ట్రస్థాయి వ్యవహారాలన్నీ చివరికి వచ్చేసరికి పక్కకు పోయాయి. ఓటుకు నోటు ఇచ్చారు. అది చాలదన్నట్లుగా బియ్యం బస్తాలు అందించారు. మాంసం కూడా అందజేశారు. కొన్ని చోట్ల చీరలూ పంచారు. ఇవన్నీ గెలుపు కోసమే చేశారు. ఎన్నికల్లో తెలుగుదేశం, వైసిపి అభ్యర్థులు ఆఖరులో వీటపైనే ఎక్కువగా దృష్టి పెట్టారు. అంతకు ముందు ఏమి చేసినా ఫలితం పెద్దగా ఉండదనే భావనకు వచ్చేశారు. పార్టీల అధిష్టానాలు కూడా కొనుగోళ్లలో వెనకపడితే నష్టపోతామనే సంకేతాలు ఇచ్చాయి. దీంతో అన్ని రకాలుగా ఆఖరుఘట్టంలో ప్రలోభాల పర్వమే నడిచింది. పోస్టల్ బ్యాలెట్‌కూ రూ.5 వేలు ఇచ్చారు. సాధారణ ఓటర్లకు రూ.2 వేల నుంచి రూ.3 వేల వరకూ ఇచ్చారు. అత్యధికంగా ఒంగోలులోనే పంపిణీలు నడిచాయి. ఇద్దరు అభ్యర్థులు కలిపి రూ.160 కోట్ల వరకూ ఓటర్లకు ఇవ్వడం గానీ, ఇతరత్రా ఖర్చు చేశారు. తర్వాత దర్శి, మార్కాపురం, కొండపి, అద్దంకి వంటి నియోజకవర్గాల్లో భారీగానే కొనుగోళ్ల నడిచాయి. ఇరువర్గాలూ ఓటర్లకు భారీగా డబ్బులు ఇచ్చారు. ఎక్కడెక్కడో ఉన్నవారికి రవాణా సౌకర్యాలూ ఏర్పాటు చేశారు. దీంతో అందరూ వచ్చి ఓటేసి పోయారు. దీంతో 84 శాతం పోలింగ్ నమోదైంది. దర్శిలో అత్యధికంగా 90.44 శాతం పోలింగ్ జరగడం విశేషం. అయితే సైలెంట్ ఓటింగ్ జరిగిందనే విశ్లేషణలున్నాయి. వాటిపై ఎవరి అంచనాల్లో వాళ్లున్నారు. మహిళల ఓట్లపైనే ఇరువర్గాలూ సందిగ్ధంగానే ఉన్నారు. తమకంటే తమకని చెప్పుకుంటున్నారు. రాష్ట్రంలో ఎవరు అధికారంలోకి వస్తారంటే గట్టిగానే పోటీలున్నాయని చెబుతున్నారు. అటు వైసిపి 95 నుంచి 120 దాకా చెప్పుకుంటుంటే కూటమి కూడా 100 నుంచి 120 సీట్లు ఖాయమని చెప్పుకుంటున్నారు. రాష్ట్రస్థాయిలో టైట్‌గా ఉందనే చర్చ దిగువకు వచ్చింది. ఇప్పుడు నియోజకవర్గాల్లో గెలుపు, ఓటములకన్నా అధికారంలోకి ఎవరు వస్తారనే దానిపైనే చర్చ సాగుతోంది. రాష్ట్రంలో ఉన్న నేతలకు నిత్యం ఫోన్లు చేసి ఎన్ని సీట్లు వస్తాయని ఉత్కంఠగా కనుక్కుంటున్నారు. ఎవరు అధికారంలోకి వచ్చినా 10 నుంచి 15 సీట్లు అధికంగా ఉంటాయనే చర్చ సాగుతోంది. తటస్తులు మాత్రం ఇదే చెబుతున్నారు. ఎవరు వచ్చినా తక్కువ మార్జిన్‌లోనే ఉంటారనే విశ్లేషణలు వినిపిస్తున్నాయి. నిఘా వర్గాలూ గట్టిగా అంచనా వేయలేకపోతున్నాయి. అయితే అధికారంలో ఉన్న పార్టీకి కొంత మొగ్గుచూపి అంచనాలు ఇవ్వడం ఇంటెలిజెన్స్ విభాగం చేస్తుంది. ఇప్పుడూ ఇదే జరిగిందని చెబుతున్నారు. కేంద్రం నుంచి వచ్చే సమాచారం కూటమికి అనుకూలంగా ఉన్నప్పటికీ పోలింగ్ తర్వాత ఏమిటనే దానిపై దృష్టి సారించారు. ఎగ్జిట్‌పోల్స్ కోసం ఎదురుచూస్తున్నారు. ఇప్పుడు ఎవరి అంచనాల్లో వాళ్లున్నారు. గెలుపుపై రెండు పార్టీల్లోనూ ధీమాలు ఉన్నాయి. కారణం అన్నిచోట్లా గట్టిపోటీలున్నాయి. బయటకు వచ్చిన మెజార్టీలు స్వల్పంగా ఉండటమే ఇందుకు అడ్డం పడుతోంది. పైకి పదివేలకు పైనే మెజార్టీ వస్తుందని చెబుతున్నా అంతర్గతంగా 5 వేలతో ▶ 2లో



జాతీయ స్థాయి నాటిక పోటీలకు సిద్ధం చేసిన కళా వేదిక

కళా సంబరానికి సర్వం సిద్ధం

- ప్రజలకు సందేశాత్మక నాటకాల పరిచయం
- నేటి నుంచి మార్టూరులో జాతీయస్థాయి నాటికల పోటీలు

4లో



మాట్లాడుతున్న కళాకారులు ఆలపాటి రామారావు

ఘర్షణలకు పాల్పడితే కఠినచర్యలు

ఎస్పీ వకుల్‌జిందాల్



పాత నేరస్తులకు కౌన్సిలింగ్ ఇస్తున్న పోలీసులు

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

ఘర్షణలకు, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్ హెచ్చరించారు. ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా ఆ తర్వాత జిల్లాలో ఎక్కడ ఎటువంటి అవాంఛనీయ ఘటనలు, ఘర్షణలు చోటు చేసుకోకుండా ముందస్తు చర్యలలో భాగంగా ఆదివారం ఎస్పీ ఆదేశాల మేరకు జిల్లా పోలీస్ అధికారులు వారి స్టేషన్ పరిధిలో నివాసముంటున్న పాత నేరస్తులకు, ఇటీవల జరిగిన ఘర్షణలలో పాల్గొన్న వారికి కౌన్సిలింగ్ నిర్వహించారు. పోలీస్ అధికారుల సూచనలు పెడచెవిన పెట్టి చట్ట వ్యతిరేక, అసాంఘిక కార్యకలాపాలలో పాల్గొన్నా, ఎన్నికల నియమావళిని అతిక్రమించి ఘర్షణలు, ర్యాలీలలో పాల్గొన్న వారిపై చట్టపరంగా కఠినచర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు. జిల్లా పోలీస్ అధికారులు, వారి పోలీస్‌స్టేషన్ పరిధిలో నివాసం వుండే పాత నేరస్తులు, ఘర్షణలకు పాల్పడటానికి అవకాశం ఉన్న వారిపై, రౌడీషీటర్స్‌పై నిరంతర నిఘా ఉంచాలని ఆదేశించారు. ఎన్నికల కౌంటింగ్ సమయంలో, ఆ తర్వాత ఎవరైనా ఘర్షణలకు పాల్పడినా, ప్రజలను రెచ్చగొట్టే విధంగా వ్యాఖ్యలు చేసినా, ర్యాలీలు, ఊరేగింపులలో పాల్గొన్నా, బాణాసంచా కాల్చినా చట్టపరంగా తీవ్రమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎటువంటి వివాదాలు, చట్ట వ్యతిరేక కార్యకలాపాల జోలికి వెళ్లకుండా, సత్ప్రవర్తనతో మెలగాలని సూచించారు.

పిల్లల్లో మానసిక వికాసానికి

సమ్మర్ క్యాంపులు దోహదం

- సినీ వ్యాపారవేత్త, కళాకారులు ఆలపాటి రామారావు
- చిన్నారులను ఆకట్టుకున్న మ్యాజిక్ క్లాస్



కర్పూరాన్ని చేతిలో వెలిగించి.. నోట్లో వేసుకొనే మ్యాజిక్‌ను విద్యార్థికి నేర్పిస్తున్న రామన్

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

పిల్లల మానసిక వికాసానికి సమ్మర్ క్యాంప్ దోహదపడుతుందని సినీ వ్యాపారవేత్త, కళాకారులు ఆలపాటి రామారావు తెలిపారు. స్థానిక ఎల్‌బిజి భవన్‌లో ఒంగోలు చిల్డ్రన్ క్లబ్ ఆధ్వర్యంలో జరుగుతున్న సమ్మర్ క్యాంపును రెండో రోజైన ఆదివారం ఆలపాటి రామారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ విద్యార్థుల మానసిక ఉల్లాసానికి చదువులతో పాటు ఆటలు, పాటలు అవసరమన్నారు. ఇటువంటి సమ్మర్ క్యాంపును ఉచితంగా నిర్వహించడం ▶ 2లో

ప్రలోభాలపైనే ఆశలు.!

(మొదటిపేజీ తరువాయి)

బయటపడతామనే ధీమాలో ఉన్నారు. దాదాపుగా అన్ని నియోజకవర్గాల్లో ఇదే పరిస్థితి. ఒంగోలులోనూ ఇద్దరు అభ్యర్థులూ పది వేల లోపు గెలుస్తామనే అంచనాలకు వచ్చారు. గెలుపు పలానా పార్టీ అభ్యర్థికి అనుకూలంగా ఉందని చెబుతున్నా.. మెజార్టీ మాత్రం ఐదారు వేలలోపే అంటున్నారు. కొన్ని చోట్ల రెండు, మూడు వేలు కూడా అంటున్నారు. ఇంత తక్కువ మెజార్టీని గుర్తించి గెలుపు ఖాయమని ఎలా చెబుతున్నారో ఓటర్లకు అంతుచిక్కడం లేదు. ఇప్పటివరకూ ఉద్యోగులు, మహిళలు, యువత, సామాజిక తరగతులు, పార్టీ పునాది ఓటింగును పరిగణలోకి తీసుకుని తర్జనభర్జన పడ్డారు. ఎవరు ఎటువైపు ఉన్నారనే దానిపై పలు రకాలుగా సమాచారం సేకరించారు. మెజార్టీలు తేల్చుకున్నారు. ఇంకా పోలింగు సరళిపై స్పష్టతకు రాలేకపోతున్నారు. ఉత్కంఠగానే శిబిరాల్లో గణాంకాలు వేసుకుంటున్నారు. వార్డులు, గ్రామాల వారీగా మెజార్టీలను పలురకాలుగా విశ్లేషణలు చేస్తున్నారు. కొందరికి గెలుపుపై ఎటూ స్పష్టత కనిపించడం లేదు. చివరికి పంపిణీలపైనే ఆశలు పెట్టుకున్నారు. ఎవరు ఎక్కువగా పంపిణీలు చేశారో వారికి ఇవే గెలుపునకు ఉపయోగపడతాయనే ఆశతో ఉన్నారు. కోట్లు కుమ్మరించాం.. ఐదారు వేలు అదనంగా రాకపోతాయా? అనే ధీమాలో కొందరున్నారు. డబ్బు ప్రభావం ఉంటుందనడంలో సందేహం లేదు. సగటు ఓటరు ఒకసారి తన ఓటు ఎటువైపు వేయాలో డిసైడ్ ఆయ్యాక డబ్బు ప్రభావం ఎంతమేరకు పనిచేస్తుందనేదీ లోతుగా చూడాలని విశ్లేషకులు చెబుతున్నారు.

సమ్మర్ క్యాంపులతో మానసిక వికాసం

(మొదటిపేజీ తరువాయి)

అభినందనీయమన్నారు. పాటలు పాడి, కథలు చెప్పి విద్యార్థులను అలరించారు. అనంతరం మ్యాజిక్ క్లాసును మ్యాజిక్ రామన్ బోధించారు. విద్యార్థులతో మ్యాజిక్ చేయించారు. మూఢనమ్మకాలు విడనాడాలని, సైన్స్‌ను ఆచరించాలని ఆయన సూచించారు. జూనియర్ చాంబర్ ఆఫ్ ఇండియా అధ్యక్షులు కోణంకి వరుణ్ పాల్గొని విద్యార్థులకు అభినంద నలు తెలిపారు. విద్యార్థులకు గేయాలను ప్రజా నాట్యమండలి నగర అధ్యక్షులు ఇంద్రజ్యోతి నేర్పించారు. 3వ రోజున 'సైన్స్‌తో సరదాగా' క్లాసును నిర్వహిస్తామని క్యాంపు నిర్వాహకులు సిహెచ్ వినోద్ తెలిపారు.

స్ట్రాంగ్ రూమ్స్‌కు మూడంచెల భద్రత

(మొదటిపేజీ తరువాయి)

గుర్తింపు కార్డులను పరిశీలించిన తర్వాత మాత్రమే లోపలికి అనుమతించాలని, కౌంటింగ్ కేంద్రాలలోకి అధికారులు, అభ్యర్థులు, ఏజెంట్లు వెళ్లేందుకు బ్యారికేడింగ్ చేపట్టాలన్నారు. కంట్రోల్ రూమ్, మీడియా పాయింట్ మౌలిక వసతుల ఏర్పాటులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు తెలియజేశారు. ఎస్‌పి వెంట అదనపు ఎస్‌పి ఎస్‌వి శ్రీధర్‌రావు, ఏఆర్ ఎస్‌పి అశోక్‌బాబు, ఒంగోలు డిఎస్‌పి ఎం కిషోర్ బాబు, డిఎస్‌పి చంద్ర శేఖర్, సింగరాయకొండ సిఐ రంగనాథ్, ఇతర శాఖల అధికారులు ఉన్నారు.

విఆర్‌ఒ సంతకం ఫోర్జరీ

ప్రజాశక్తి-గిద్దలూరు రూరల్

తన సంతకం ఫోర్జరీ చేసిన వారిపై తగు చర్యలు తీసుకోవాలని గిద్దలూరు తహశీల్దారు, అర్బన్ సిఐలకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసినట్లు వీఆర్‌ఒ ఎస్ ఈశ్వర్‌రెడ్డి ఆదివారం తెలిపారు. గిద్ద లూరు మండలం జయరాంపురం గ్రామానికి చెంది న అవిజ అరుణకుమారి తన సంతకాన్ని ఫోర్జరీ చేసినట్లు తెలిపారు. జయరాంపురం అసైన్మెంట్ నెంబర్ 402, రెవెన్యూ సర్వే నెంబర్ 643/4లో 82.79 చదరపు గజాల ఖాళీ స్థలం రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు ఆమె గిద్దలూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లగా పత్రాలు పరిశీలించిన అధికారులు స్థల ధ్రువీకరణ పత్రంపై అనుమానం వచ్చి సంబంధిత విఆర్‌ఓకు సమాచారం ఇచ్చారు. ఆ మేరకు విఆర్‌ఓ ధ్రువీకరణ పత్రాలు పరిశీలించగా తన సంతకం ఫోర్జరీ చేసినట్లు విఆర్‌ఓ ఎస్ ఈశ్వర్‌రెడ్డి తెలిపారు. ఈ సంతకం తనది కాదని, తన సంతకాన్ని ఫోర్జరీ చేశారని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం అధికారులకు సమాచారం ఇచ్చారు. దీంతో రిజిస్ట్రేషన్ ఆగిపోయింది. ఈ విషయంపై గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు వైపి రంగయ్య మాట్లాడుతూ ఫోర్జరీ సంతకాలు చేసేవట్ల చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

అస్తవ్యస్త డ్రెయిన్లతో..

రోడ్లపై పారుతున్న మురుగు



రోడ్డు పైకి చేరిన మురుగు

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

అస్తవ్యస్త డ్రెయిన్లతో రోడ్లపై మురుగునీరు పారుతోంది. దీంతో ప్రజలు అవస్థలు పడుతున్నా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోని దుస్థితి యర్రగొండపాలెం పట్టణంలో నెలకొంది. పూడిక తీయకపోవడం వలన డ్రెయినేజీ వ్యవస్థ పూర్తిగా అస్తవ్యస్తంగా తయారైంది. దీంతో మురుగు నీరంతా రోడ్లపైనే ప్రవహిస్తోంది. అసలే పట్టణంలో అంతర్గత రోడ్లు అధ్వానంగా ఉండడంతో అవస్థలు పడుతున్న ప్రజలకు రోడ్లపై మురుగునీరు ప్రవహించడం, వర్షపు నీరు నిల్వ ఉండడంతో నరకం చవిచూస్తున్నారు. వ్యాధులు సోకుతాయేమోనని భయాందోళన చెందుతున్నారు. ముఖ్యంగా వస్తాద్ వారి వీధి, దిలావర్ వారి వీధి, బీసీ కాలనీ, చైతన్య నగర్‌లలో మురుగు నీరు నిల్వ ఉండడం వలన దోమలు చేరి రాత్రి పగలు తేడా లేకుండా వాటి ప్రతాపం చూపిస్తున్నాయి. దోమల నిర్మూలనకు కూడా అధికారులు, ప్రజాప్రతినిధులు ఎలాంటి చర్యలూ తీసుకోలేదు. మూడు రోజుల క్రితం కురిసిన వర్షాలకు రోడ్లపై గోతులలో నీరునిలిచి కొద్దిపాటి తటాకాలను తలపిస్తున్నాయి. మురుగు నీరు రోడ్లపై నిల్వ ఉండడంతో అక్కడ దుర్గంధం వెదజల్లుతోంది. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి డ్రెయినేజీ వ్యవస్థను అభివృద్ధి చేసి పారిశుధ్యం మెరుగుపరచాలని ప్రజలు కోరుచున్నారు.

దివ్య హెల్పింగ్ హ్యాండ్స్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో..

ట్రై సైకిల్ పంపిణీ



ట్రై సైకిల్ పంపిణీ చేస్తున్న హెల్పింగ్ హ్యాండ్స్ ఆర్గనైజేషన్ సభ్యులు

ప్రజాశక్తి-కొమరోలు

కొమరోలు మండలం తాతిరెడ్డిపల్లె గ్రామానికి చెందిన జయరాంరెడ్డికి ఆదివారం దివ్య హెల్పింగ్ హ్యాండ్స్ ఆర్గనైజేషన్ వారి ఆధ్వర్యంలో ట్రై సైకిల్‌ను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో లబ్ధిదారుడు జయరాంరెడ్డి మాట్లాడుతూ తనలాంటి పేద వికలాంగుడికి ట్రై సైకిల్స్ ఇచ్చినందుకు దివ్య హెల్పింగ్ హ్యాండ్స్ ఆర్గనైజేషన్ వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో దివ్య హెల్పింగ్ హాండ్స్ ఆర్గనైజేషన్ అధ్యక్షులు లొక్కు శరత్‌బాబు, ఉపాధ్యక్షులు సునీల్ కుమార్ నాయుడు, సెక్రటరీ కారుమంచి చిన్న పీరయ్య, కామూరి శివరామిరెడ్డి, రవికుమార్, బైక్ మెకానిక్ కిషోర్ కుమార్, వెంకటసుబ్బయ్య, గ్రామ ప్రజలు పాల్గొని సహాయం చేసిన అందించిన దాతలకు ధన్యవాదాలు తెలియజేశారు.



శివం శరణాలయానికి స్టాండ్ ఫ్యాన్లు బహూకరిస్తున్న దాత

వృద్ధులకు అన్నదానం

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా అధ్యక్షులు, మాంటిస్సోరి స్కూలు అధినేత పి ప్రకాష్‌బాబు, జయశ్రీ దంపతుల వివాహ రోజు వేడుకలు శివం శరణాలయంలో ఘనంగా నిర్వహించారు. నగరంలోని పలు ప్రాంతాల్లో శివం సంచార వాహనం ద్వారా అన్నదానం నిర్వహించారు. అనంతరం శరణాలయంలో పి ప్రకాష్ బాబు, కుమారుడు శబరినాథ్, కోడలు ఈషా సమక్షంలో కేకు కట్ చేసి వృద్ధులకు అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా మారెళ్ల సుబ్బారావు, రచయిత, నటుడు డాక్టర్ మొగిలిదేవ మాట్లాడారు. నేరెళ్ల సుబ్బారావు శివం శరణాలయానికి రెండు స్టాండ్ ఫ్యాన్లు అందజేశారు. కార్యక్రమంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ కోశాధికారి రాఘవ, శివం ఫౌండేషన్ చైర్మన్ గొల్లపూడి శ్రీహరి పాల్గొన్నారు.

అనారోగ్యంతో ఎల్ఐసి అధికారి మృతి



ఏఏఓ ఎస్‌వి సుబ్బారావు (ఫైల్)

ప్రజాశక్తి-పొదిలి

స్థానిక జీవిత బీమా కార్యాలయంలో ఏఏఓగా పని చేస్తున్న ఎస్‌వి సుబ్బారావు(56) అనారోగ్యంతో హైదరాబాద్ కిమ్స్‌లో చికిత్స పొందుతూ శుక్రవారం తెల్లవారుజామున మృతి చెందారు. ఆయన మృతదేహాన్ని ఒంగోలులోని భాగ్యనగర్ నాలుగో లైన్‌లోని వారి స్వగృహానికి తీసుకొచ్చారు. ఆదివారం ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని జీవిత బీమా అధికారులు, సిబ్బంది ఆయన మృత దేహాన్ని సందర్శించి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో మార్కాపురం ఎల్ఐసి సీనియర్ బ్రాంచి మేనేజర్ చెన్నయ్య, ఏబిఎం భాస్కర్‌రావు, పొదిలి శాటిలైట్ బ్రాంచి మేనేజర్ బి వెంకటస్వామి, ఏజెంట్లు ఉన్నారు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.



సమావేశంలో సభ్యత్వ కార్యక్రమం ప్రారంభిస్తున్న జెవివి ప్రధాన కార్యదర్శి జయప్రకాశ్

ప్రజల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించాలి: జెవివి

ప్రజాశక్తి-పొదిలి

ప్రజలలో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించేందుకు జెవివి కృషి చేస్తుందని జిల్లా ప్రధాన కార్యదర్శి జయప్రకాశ్ అన్నారు. శనివారం రాత్రి స్థానిక కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ విద్యార్థుల్లో మూఢనమ్మకాలను విడనాడే విధంగా శాస్త్రీయ అవగాహన కల్పించాలన్నారు. మండల స్థాయిలో జెవివి ఆధ్వర్యంలో వార్షిక సభలు నిర్వహించాలని, సభ్యత్వ నమోదు పెంచాలని సూచించారు. జూన్ 9న చీరాలలో సైద్ధాంతిక శిక్షణా తరగతులను జయప్రదం చేయాలని అన్నారు. చెకుముకి పత్రిక చందాలను పెంచాలన్నారు. జెవివి జిల్లా ఉపాధ్యక్షులు దాసరి గురుస్వామి మాట్లాడుతూ జెవివి లక్ష్యాలను విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మానవత సంస్థ ప్రతినిధి యలమందారెడ్డి, యుటిఎఫ్ జిల్లా సహాధ్యక్షులు షేక్ అబ్దుల్ హై, జెవివి జిల్లా కార్యదర్శి బి దేవప్రసాద్, కొనకనమిట్ల, పొదిలి మండలాల జెవివి అధ్యక్షులు పివి కొండయ్య, జూపల్లి వెంకటేశ్వర్లు, జెవివి సభ్యులు ఆంజనేయ చౌదరి, బాజీ కరిముల్లా, మూసా జానీ, ఎంవి శ్రీనివాసరావు, కామేశ్వరరావు పాల్గొన్నారు. అనంతరం సభ్యత్వ నమోదు ప్రారంభించారు.

గ్రంథాలయంలో పుస్తక పఠనం

ప్రజాశక్తి-కొండపి

వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా విద్యార్థులు పుస్తక పఠనం చేసినట్లు గ్రంథపాలకుడు కోటేశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ఉపాధ్యాయుడు శ్రీధర్ గణితంలో తీసుకోవాల్సిన మెలుకువల గురించి అవగాహన కల్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పుస్తక పఠనం ద్వారా విద్యార్థులు విజ్ఞాన వంతులు అవుతారని తెలిపారు. గ్రంథాలయంలోని రకకరాల పుస్తకాలు చదవాలన్నారు. అనంతరం విద్యార్థుల చేత కథలు చెప్పించారు. కథల పుస్తకాలను చదించారు.

28న కౌన్సిలింగ్

ప్రజాశక్తి-కొనకనమిట్ల

వెలుగొండ డాక్టర్ బిఆర్.అంబేద్కర్ గురుకుల పాఠశాలలో 5వ తరగతిలో మిగిలిపోయిన సీట్లల్లో ఎస్‌సి విద్యార్థులకు నేరుగా ప్రవేశం కల్పించనున్నట్లు ప్రిన్సిపల్ వెంకటేశ్వరరావు తెలిపారు. అందుకోసం ఈనెల 28న దర్శిలోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కౌన్సిలింగ్‌కు గతంలో ప్రవేశ పరీక్ష రాసి సీటు రాని వారు, పరీక్షకు హాజరు కాని వారు కూడా తగిన ఆధారాలతో కౌన్సిలింగ్‌కు హాజరు కావచ్చునని ఆయన తెలిపారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపల్ వెంకటేశ్వరరావు కోరారు.



విజేతలకు బహుమతులు అందజేస్తున్న రాయుడు రవీంద్ర

బహుమతులు అందజేత

ప్రజాశక్తి - చీరాల

వేసవి విజ్ఞాన శిబిరాలను విద్యార్థులు సద్వినియోగం విజ్ఞానాన్ని పెంపుదించుకోవాలని ఎంప్లాయిమెంట్ అధికారి రాయుడు రవీంద్ర తెలిపారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో వివిధ పోటీల్లో గెలుపొందిన విజేతలకు ఆదివారం బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల చేత నీతి కథలు, విజ్ఞానదాయకమైన పుస్తకములు, చదివిస్తూ వారి మేధస్సు పెంపుదలకు కృషి చేస్తున్న గ్రంథపాలకురాలు ధనమ్మ సేవలు అభినందనీమని తెలిపారు. విద్యార్థులు నేర్చుకున్న పలు పాఠ్యాంశాలు, నీతి కథలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా 20 మంది పిల్లలకు గ్రంథాలయ సభ్యత్వం కట్టి వారిని ప్రోత్సహించారు. అనంతరం పిల్లలకు పరుగు పోటీ నిర్వహించాఉరు. ఈ కార్యక్రమంలో రాజు. గ్రంథాలయ ఫ్యాకల్టీ కె.మోహన్ పాల్గొన్నారు.

యువకుడు గల్లంతు

ప్రజాశక్తి చీమకుర్తి

మండల పరిధిలోని రామతీర్థం రిజర్వాయర్‌లో ఓ యువకుడు గల్లంతు అయ్యాడు. పోలీసులు కథనం ప్రకారం... తాళ్లూరు మండలం రామభద్రపురం గ్రామానికి చెందిన యాతం మణికంఠ (20) అనే యువకుడు మరో ఎనిమిది మిత్రులతో కలిసి రామతీర్థం రిజర్వాయర్ చూసేందుకు ఆదివారం వచ్చాడు. ఈ క్రమంలో మణికంఠ ప్రమాదవశాత్తు రిజర్వాయర్‌లో పడి పోయాడు. సమాచారం అందుకున్న ఎస్ఐ కృష్ణయ్య ఘటనా స్థలానికి చేరుకున్నారు. యువకుడి ఆచూకీ కోసం ఈతగాళ్లతో రిజర్వాయర్‌లో గాలింపు చర్యలు చేపట్టారు. అయినప్పటికీ యువకుడి ఆచూకీ లభ్యం కాలేదు.

మద్యం మత్తులో రైలు కింద చేతులు పెట్టిన యువకుడు

ప్రజాశక్తి - చీరాల

మద్యం మత్తులో ఓ యువకుడు రైలు కింద చేతులు పెట్టడంతో అవి తెగిపోయాయి. ఈ ఘటన చీరాలలోని కారంచేడు రైల్వేగేటు వద్ద శనివారం తెల్లవారు జామున చోటు చేసుకుంది. అందిన వివరాల ప్రకారం.. చీరాల పట్టణంలోని పేరాల వడ్డేనాగేశ్వరావు బజారుకు చెందిన ఈశ్వరరావు రైల్వే గేటు సమీపంలోని దుకాణంలో ఫుల్‌గా మద్యం తాగాడు. అనంతరం మద్యం మత్తులో రైలు పట్టాలపై రెండు చేతులు పెట్టాడు. అవి పూర్తిగా తెగిపోయాయి. స్థానికులు గమనించి గుంటూరు హాస్పటల్‌కు తరలించారు. ఆ యువకుడు పరిస్థితి విషయంగా ఉన్నట్లు తెలిసింది.

పాత కక్షల నేపథ్యంలో కత్తితో దాడి ముగ్గురికి గాయాలు

ప్రజాశక్తి-కురిచేడు



గాయపడిన వ్యక్తి

వ్యక్తిగత కక్షల నేపథ్యంలో ఓ వ్యక్తి ముగ్గురిపై కత్తితో దాడి చేసి గాయపరిచాడు. ఈ ఘటన మండల పరిధిలోని పెద్దవరం గ్రామంలో శనివారం రాత్రి చోటు చేసుకుంది. అందిన వివరాల ప్రకారం... పెద్దవరం గ్రామానికి చెందిన ఎర్రగుంట్ల నాగేశ్వరావు పాత కక్షల నేపథ్యంలో అదే గ్రామానికి ఎర్రగుంట్ల ఏసు, ఎర్రగుంట్ల అబ్రహం, మరియమ్మపై విచక్షణ రహితంగా కత్తితో దాడి చేశాడు. దీంతో వారికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 వాహనంలో వైద్యశాలకు తరలించారు. ముగ్గురు పరిస్థితి ఆందోళనకరంగా ఉండటంతో మెరుగైన చికిత్స కోసం నరసరావుపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు నమెదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జారిపడి వ్యక్తికి గాయాలు

ప్రజాశక్తి -సిఎస్ పురంరూరల్

స్టేజీ మీదనుంచి ప్రమాదవశాత్తు జారి పడిన ఘటనలో ఓ వ్యక్తికి గాయాలయ్యాయి. ఈ ఘటన మండల పరిధిలోని డీజీ పేట లో శనివారం రాత్రి చోటు చేసుకుంది. కోదండరామస్వామి వార్షిక కల్యాణ మహోత్సవంలో భాగంగా మహిళలు చెక్క భజన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా భజన గురువు గంజరపల్లి వెంకటేశ్వర్లు ప్రమాదవశాత్తు స్టేజీ మీద నుంచి పడిపోయాయి. ఆయనకు గాయాలు కావడంతో ప్రైవేట్ వాహనంలో కనిగిరి వైద్యశాలకు తరలించారు.

మందుబాబుల ఆగడాలు

ప్రజాశక్తి-చీమకుర్తి



తాగి పడేసిన మద్యం బాటిళ్లు

చీమకుర్తిలో మందుబాబుల ఆగడాలు ఎక్కువయ్యాయి. స్థానిక మువ్వావారిపాలెం డొంక, కెవిపాలెం డొంక ప్రాంతాల్లో నిత్యం పట్టపగులే మద్యం తాగుతూ పరిసరాలలో ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. మువ్వావారిపాలెం డొంక,కెవిపాలెం డొంక పరిసరాలోని సుబాబుల్, సరుగుడు తోటలలో మద్యం తాగుతూ అటుగా వచ్చే పాదచారులను భయభ్రాంతులను చేస్తున్నారు. మద్యం సీసాలు ,బిరియాని ప్యాకెట్లు తెచ్చుకొని అక్కడ కూర్చొని గంటల తరబడి మద్యం తాగుతున్నారు. అర్ధరాత్రి వరకూ ఇదేపనిలో ఉంటున్నారు. కొందరు ఫుల్‌గా తాగి అక్కడే పడిపోతున్నారు. మద్యం మత్తులో ఘర్షణ పడి ఒకరి ఒకరిపై దాడులు చేసుకుంటున్నారు. మందు బాబులు తాగి పడవేసి సిగిరెట్ పీకల కారణంగా మంటలు చెలరేగి సుబాబుల్, సరుగుడు తోటలు కాలిపోతున్నాయి. ఇటీవల చిన్న బ్రిడ్జి సమీపంలోని సరుగుడు తోటలో నిప్పు పడి చాలా చెట్లు కాలిపోయాయి. ఆయా ప్రాంతాలలో ఉదయం, సాయంత్రం మహిళలు,పెద్దలు ప్రతిరోజూ వాకింగ్‌కు వెళ ్తుంటారు. మందుబాబుల కారణంగా తమకు ఎలాంటి ప్రమాదం సంభవిస్తుందోనని భయాందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా పోలీసులు స్పందించి మందు బాబుల ఆగడాలకు అడ్డుకట్ట వేయాలని ప్రజలు కోరుతున్నారు.

బైకును ఢీకొన్న టిప్పర్

వ్యక్తి మృతి

ప్రజాశక్తి-సంతనూతలపాడు



మృతిచెందిన వెంకట సుబ్బారావు

బైకును టిప్పర్ ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన మండల పరిధిలోని ఎండ్లూరు డొంక సమీపంలో ఆదివారం చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో మద్దిపాడు మండలం బసవన్నపాలెం గ్రామానికి చెందిన గొర్రె వెంకట సుబ్బారావు (64) మృతి చెందాడు. మృతుడు తన స్వగ్రామం నుంచి బైకుపై ఎండ్లూరు డొంక సమీపంలోనున్న రాధా మాధవ్ సత్సంగ్ కేంద్రంలో సేవలు అందిచేందుకు వస్తున్నాడు. ఈ క్రమంలో సత్సంగం ఎదురుగా రోడ్డు యూటర్న్ తీసుకుంటున్నాడు. అదే సమయంలో చీమకుర్తి వైపు వెళుతున్న టిప్పర్ వెనుక నుంచి బైకును ఢీకొంది. దీంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. ఒంగోలు తాలూకా పోలీసు స్టేషన్ ఎస్ఐ విజయ్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నాడు.



మృతిచెందిన గుర్తుతెలియని వ్యక్తి

గుర్తుతెలియని వ్యక్తి మృతి

ప్రజాశక్తి- శింగరాయకొండ

రైలు ఢీకొన్న ఘటనలో గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన శింగరాయకొండ రైల్వే స్టేషన్ పరిధిలోని సోమరాజుపల్లి రైల్వే గేటు వద్ద ఆదివారం చోటు చేసుకుంది. స్థానిక రైల్వే మెన్ చెప్పిన వివరాలు ప్రకారం... సుమారు 45 సంవత్సరాల వ్యక్తి రైలు పట్టాలు దాటుతున్నాడు. అదే సమయంలో రైలు రావడాన్ని స్థానికులు గుర్తించి పట్టాలు దాటవద్దని పెద్దపెద్దగా కేకలు వేశారు. రైలు శబ్ధానికి ఆ వ్యక్తికి వినిపించలేదు. ఇంతలోనే రైలు ఢీకొనడంతో అక్కడిక్కడే మృతిచెందాడు. ఒంగోలు రైల్వే పోలీసులకు సమాచారం అందించారు. రైల్వే పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి మతదేహాన్ని ఒంగోలు రిమ్స్ కు తరలించారు.

పాదచారికి గాయాలు

ప్రజాశక్తి - అద్దంకి

పాల వాహనం ఢీకొన్న ఘటనలో పాదచారుడికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన స్థానిక రామనగర్ సమీపంలో ఆదివారం చోటు చేసుకుంది. అందిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని నాగులపాడు గ్రామానికి చెందిన జ్యోతి ఆకాష్ రోడ్డు దాటుతున్నాడు. అదే సమయంలో పాల వాహనం ఢీకొంది. దీంతో ఆకాష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. క్షత గాత్రుడిని 108 వాహానానికి స్థానిక పభుత్వ వైద్యశాలకు తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

డిజిపేటలో అన్నదానం

ప్రజాశక్తి- సిఎస్ పురంరూరల్



స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

మండల పరిధిలోని డిజిపేట గ్రామంలో సీతారాముల కల్యాణ మహోత్సవ వేడుకలు ఆదివారం వైభవంగా నిర్వహించారు. శ్రీ కోదండరామ స్వామి వార్షిక కళ్యాణ మహోత్సవంలో భాగంగా సీతారాముల కల్యాణం నిర్వహించారు. రాత్రికి గ్రామోత్సవం నిర్వహించారు. గ్రామ పెద్దకాపు పావలి తిరుపతయ్య, తిరుపతమ్మ దంపతులు పీటలపై కూర్చొని స్వామివారి కల్యాణం జరిపించారు. దొంగరి సుబ్బరాయుడు వెంకట సుబ్బమ్మ దంపతుల సహకారంతో స్వామివారి గ్రామోత్సవం నిర్వహించారు. గోదాసు లక్ష్మయ్య సుబ్బమ్మ దంపతుల జ్ఞాపకార్థం, వారి కుమారులు గోదాసు రఘురాములు సుబ్బమ్మ, మాజీ ఎంపిటిసి గోదాసు జయరాములు, మాజీ సర్పంచి బాలసుబ్బమ్మ దంపతుల సహకారంతో మధ్యాహ్నం అన్నదానం నిర్వహించారు. చెవుల పెద్దయ్య జ్ఞాపకార్థం వెంకటలక్ష్మమ్మ, చెవుల చినమాలకొండయ్య కుమారులు పెద్ద తిరుపతయ్య, నడిపి తిరుపతయ్య సహకారంతో రాత్రికి అన్నదానం నిర్వహించారు.

ముగిసిన బ్రహ్మోత్సవాలు

ప్రజాశక్తి - నాగులుప్పలపాడు



శ్రీ వేణుగోపాల స్వామి గ్రామోత్సవం

మండల పరిధిలోని ఉప్పుగుండూరులో వేంచేసి యున్న రుక్మిణీ సత్యభామ సమేత శ్రీవేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. ముగింపు సందర్భంగా తెలగసంఘం ఆధ్వర్యంలో వసంతోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. వసంతోత్సవం సందర్భంగా యువకుడు, మహిళలు కేరింతలు కొడుతూ ఒకరిపై మరొకరు పసుపు నీళ్లు పోసుకున్నారు. వసంతోస్వం సందర్భంగా స్వామి వారిని ఆలయ పూజారి దివి శ్రీధర్ బాబు, శిష్టా పాండురంగయ్య ప్రత్యేకం అలంకరించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానకమిటీ చైర్మన్ పెంట్యాల జ్యోతి శ్రీనివాసరావు, ఇఒ మీనిశెట్టి శ్రీనివాసరావు, బాలిశెట్టి నాగేశ్వరరావు, మాదాసు సుబ్బారావు, కేమా మణి, శేషయ్య, చింతపల్లి రామకష్ణ, పెంట్యాల శ్రీనివాసరావు, కొండయ్య, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఎన్నికల్లో గెలిచేది మనమే

కార్యకర్తల ఆత్మీయ సమావేశంలో గొట్టిపాటి రవికుమార్



ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న గొట్టిపాటి రవికుమార్, సమావేశానికి హాజరైన టిడిపి నాయకులు, కార్యకర్తలు

ప్రజాశక్తి - అద్దంకి

కేంద్రంలో, రాష్ట్రంలో ఎన్‌డిఎ కూటమి ప్రభుత్వమేనని అద్దంకి అసెంబ్లీ ఎన్‌డిఎ అభ్యర్థిగా తానే గెలవనున్నట్లు గొట్టిపాటి రవికుమార్ చెప్పారు. స్థానిక నాగులపాడు రోడ్డులోని కామేపల్లి కల్యాణ మండపంలో టిడిపి కార్యకర్తల ఆత్మీయ సమావేశంలో ఆయన ఆదివారం మాట్లాడారు. పట్టణంలో అత్యధిక మెజారిటీతో తాను గెలుస్తానని అన్నారు. తన గెలుపులో సహకరించి ఎన్నికల ప్రచార సమయంలో అన్ని తానై తనను వెంట ఉండి సహకరించిన ప్రతి కార్యకర్తకు పేరు పేరున ధన్యవాదంలు తెలిపారు. గత 5ఏళ్లలో జగన్ ప్రభుత్వంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు ఆర్థికంగా, సామాజికంగా అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని అన్నారు. జనసేన అధిపతి పవన్ కల్యాణ్‌ను విశాఖపట్నంలో ప్రజలను కలిసేందుకు వెళ్తే జగన్ ప్రభుత్వం ఎన్ని ఇబ్బందులు పెట్టిందో అందరికీ తెలిసిందేనని అన్నారు. రాష్ట్రంలో జగన్ చేసిన అరచాకాలు రాష్ట్ర చరిత్రలో మునుపెన్నడూ చూడలేదని అన్నారు. రాష్ట్రంలో ఎన్నికల సమయంలో పోలింగ్ కేంద్రాల్లో జగన్ ఓటమి భయంతో నియోజకవర్గాల్లో ఆయన అనుయాయులు, ఎంఎల్‌ఎ అభ్యర్థులు స్వయంగా మారణాయుధాలతో అరాచకాలు, గొడవులు సృష్టించి టిడిపి వాళ్ళపై చేసిన దాడులు కళ్ళ ముందే చూశామన్నారు. అద్దంకిలో మాత్రం ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగాయని అన్నారు. వచ్చే నెల 4న బాపట్ల ఇంజనీరింగ్ కాలేజీలో ఓట్ల లెక్కింపు జరుగుతుందని తెలిపారు. అదే రోజు ఫలితాలు తెలుస్తాయని అన్నారు. ఆ సమయంలో జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఆ రోజు జరిగే ఓట్ల లెక్కంపుకు వెళ్ళే ఏజెంట్లు పేర్లను సిద్ధం చేసుకోవాలని సూచించారు. లెక్కింపు సమయంలో చాలా అప్రమత్తంగా ఉండాలని అన్నారు. దేనికైనా సిద్దంగా ఉండాలని సూచించారు. రాష్ట్రంలో వచ్చే ఎన్‌డిఎ ప్రభుత్వంలో చంద్రబాబు ముఖ్య మంత్రి కావడం ఖాయమని అన్నారు. ఆయన ప్రమాణ స్వీకారానికి మనం సిద్ధంగా ఉండాలని అన్నారు. అనంతరం గ్రామాల వారీగా నాయకులు, కార్యకర్తలు కలిసి మాట్లాడుతూ ఎన్నికల్లో తనకు సహకరించి నందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఆత్మీయ సమావేశంలో టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు నాగినేని రామకృష్ణ, పట్టణ, మండల అద్యక్షులు చిన్ని లక్ష్మి శ్రీనివాసరావు, కె నాగేశ్వరరావు, పోతిరెడ్డి శ్రీనివాసరెడ్డి, పట్టణ తెలుగు యువత అద్యక్షులు వి పూర్ణచంద్రరావు, టిడిపి క్లస్టర్ కన్వీనర్ కరి పరమేష్, మానం మురళీ మోహనదాస్, కుందారపు రామారావు, కాకాని అశోక్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు అందని జీతాలు

మూడేళ్లుగా అందని దుస్తులు, వస్తువులు



వేతనాలివ్వక పోయినా చెత్త సేకరిస్తున్న పారిశుధ్య కార్మికులు

ప్రజాశక్తి - ఇంకొల్లు

ఇంకొల్లు పంచాయితీలో పారిశుధ్య పనులు చేసే కార్మికులకు మూడు నెలలుగా జీతాలు అందలేదు. దీంతో కార్మికులు అప్పులు చేయాల్సి వచ్చింది. నేటికీ పారిశుధ్య కార్మికులకు వేతనం చెల్లించలేదు. పంచాయితీలో సాధారణ నిధులు లేవన్న సాకుతో కార్మికులకు జీతం చెల్లించకుండా కాలయాపన చేస్తున్నారని పారిశుధ్య కార్మికులు కార్యదర్శిపై ఆరోపణలు చేస్తున్నారు. పంచాయతీలో రూ.2కోట్ల పైన నిధులు గోల్మాల్ జరిగినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ విషయమై గతంలో పనిచేసిన పంచాయితీ కార్యదర్శి మోహనరావును సస్పెండ్ చేశారు. అదే విధంగా ఇంకొల్లు సర్పంచ్ ప్రసన్నలక్ష్మి చెక్ పవర్ రద్దు చేశారు. విధుల్లో కొనసాగుతున్న కొత్త కార్యదర్శి నాగయ్య ఆధ్వర్యంలో ప్రస్తుతం పంచాయతీ పాలన వ్యవహారం సాగుతోంది. కార్యదర్శి నాగయ్య విధుల్లో చేరిన కొత్తలో పంచాయతీ పారిశుద్ధ కార్మికులు అప్పటికే మూడు నెలలకుపైగా వేతనాలు ఇవ్వలేదని విధులు బహిష్కరించి ఆందోళన చేపట్టారు. ఆ సమయంలో కార్యదర్శి, ఈఓఆర్డితో పాటు జరిగిన ఒప్పందంలో రెండు నెలల జీతం కార్మికులకు అందించారు. ఆ తర్వాత మరల ఇప్పటి వరకు కార్మికుల జీతాలు ఇవ్వలేదని కార్మికులు ప్రజాశక్తి ముందు వాపోయారు. ఇటీవల పంచాయతీ నిధుల గోల్మాల్ విషయమై అప్పటి కార్యదర్శి కిరణ్ కుమార్, మరియదాసు, మోహనబాబును డిఎల్‌పిఒ విచారించారు. అతకు ముందు పంచాయతీ కార్యాలయంలోని దస్త్రాలను కంప్యూటర్ ఆపరేటర్ దహనం చేయటం పెద్ద చర్చ జరిగింది. పంచాయితీ నిధులు గోల్మాల్ విషయంలో సెక్రెటరీలు సర్పంచితో పాటు సంబంధిత కార్యాలయ సిబ్బందికి సబంధం ఉందన్న విషయం బహిరంగ రహస్యం. అప్పటి అధికార పార్టీ నాయకుల అండతో పాటు ఉన్నత అధికారుల అండతోనే రూ.లక్షలు చేతులు మారినట్లు ఆరోపణలు ఉన్నాయి. అందుకు విచారణ సుధీర్గంగా కొనసాగినట్లు ఆరోపిస్తున్నారు. పంచాయతీ ఎన్నికలకు ముందు ప్రత్యేక అధికారుల పరిపాలన సమయం నుంచి పంచాయితీలో అనేక అక్రమాలు జరిగాయని, నిధులు అక్రమంగా కార్యదర్శుల సమయంలో దుర్వినియోగం చేశారనే ఆరోపణలపై అధికారులు విచారణ కూడా చేశారు. పంచాయితీలో నిధులు లేవనే సాకు చూపి కార్మికుల జీతాలతో కార్మికులకు ఏటా అందించే బట్టలు, బూట్లు, కొబ్బరి నూనె, సబ్బులు వంటి వస్తువులు కూడా మూడేళ్లుగా పారిశుధ్య కార్మికులకు ఇవ్వడంలేదని కార్మికులు వాపోతున్నారు. బట్టలు, బూట్లు, కొబ్బరి నూనె విషయమై మూడేళ్లుగా ఇవ్వవలసి ఉన్న ఆ సమయాన్ని కుదించి ఒక సంవత్సరానికి ఇచ్చే ప్రయత్నం చేస్తున్నారని, అవి కూడా ఇస్తారో లేదో తెలియని చెబుతున్నారు. నిధుల గోల్మల్‌పై విచారణకు డిఎల్‌పిఒ వచ్చిన సందర్భంలో పారిశుధ్య కార్మికులు జీతాలు విషయం అయన ద్రుష్టికి తీసుకెళ్లారు. పంచాయతీలో నిల్వ నిధుల్లో కొంచం కార్యాలయం అత్యావసరాలకు ఉంచి మిగిలిన నిధులు కార్మికులు జీతాలకు సర్దు బాటు చేయాలని సూచించినట్లు సమాచారం.

కళా సంబరానికి సర్వం సిద్ధం

- సామాజిక చైతన్యమే లక్ష్యంగా 13 ఏళ్లుగా ప్రయాణం
- ప్రజలకు సందేశాత్మక నాటకాల పరిచయం
- నేటి నుంచి మార్టూరులో జాతీయ స్థాయి నాటికల పోటీలు

ప్రజాశక్తి - మార్టూరు రూరల్

శ్రీకారం రోటరీ కళాపరిషత్ ఆధ్వర్యంలో నాటక రంగం ద్వారా సమాజాన్ని ఎక్కువగా చైతన్య పర్చువచ్చునే ఆలోచనతో 2007లో రోటరీ క్లబ్‌తో కలిసి శ్రీకారం రోటరీ కళాపరిషత్ స్థాపించారు. ప్రపంచ వ్యాప్తంగా వందలాది దేశాల్లో తమ సేవలతో విస్తరించిన రోటరీ క్లబ్ నాటక రంగంలో సేవలందించడం ఒక్క మార్టూరులోనే సాధ్య మైందని అధ్యక్షులు సాంబశివరావు చెపుతున్నారు. ప్రారంభంలో రూ.3లక్షల వ్యయంతో కళా పరిషత్ నిర్వహించి నప్పటికీ ప్రస్తుతం రూ.12లక్షల వరకు నిర్వహణ వ్యయం అవుతుందని నిర్వాహకులు చెపుతు న్నారు. గ్రామస్తులు, దాతలు, రోటరీ క్లబ్ సహకారంతో ఈ నెల 27, 28, 29 తేదీల్లో మార్టూరు నాగరాజుపల్లి సెంటర్లోని మద్ది సత్యనారాయణ కంపెనీ ఆవరణలో మూడు రోజులు పాటు ఉభయ తెలుగు రాష్ట్రాల నాటిక పోటీలతో 14వ సంవత్సరంలోకి అడుగు పెడుతున్నట్లు సంస్థ కన్వీనర్ జాష్టి వెంకట మోహనరావు, కార్యదర్శి జాష్టి అనురాధ ప్రజాశక్తికి తెలిపారు. ఇక్కడి ప్రదర్శనకు వచ్చే నాటికలు కూడా గ్రామీణ ప్రాంత సమస్యలకు దర్పణం పడుతూ వాటికి పరిష్కారాలు చూపుతూ సందేశాత్మకంగా ఉండటం విశేషం. ఎంపికైన విజేతలతోపాటు పాల్గొన్న ప్రతి ఒక్కరికి వ్యక్తి గత బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. ఈ వేడుకల్లో భాగంగా ప్రతి సంవత్సరం వివిధ రంగాల్లో సమాజానికి సేవలు అందిస్తున్న వ్యక్తులను, సినీ, నాటక రంగానికి సేవలు అందిస్తున్న అనేక మంది నటీ, నటులను మార్టూరుకు ఆహ్వానించి, వారికి విశిష్ట పురస్కారాలు అందజేయడం ఆనవాయితీగా వస్తోందని తెలిపారు. కళాపరిషత్ స్థాపించినప్పటి నుండి ఏటా మూడురోజుల పాటు జాతీయ స్థాయి తెలుగు రాష్ట్రాల నాటికల పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విభిన్నమైన అంశాల సమాహారమైన కళారూపాలను ఎంపిక చేసి ప్రదర్శించడంతో క్రమంగా పరిషత్తుకు జాతీయ స్థాయిలో గుర్తింపు లభించిందని అధ్యక్షులు కందిమళ్ల సాంబశివరావు తెలిపారు. కళలను అందరు ఆదరించాలని, తమ ఆలోచనలకు ప్రజలు, దాతలు సహకరించడం వల్ల తమ ప్రయత్నం విజయవంతమైందని అననారు. సినిమా లాగ నాటాకాన్ని కూడా ప్రేక్షకులు ఆదరించి టిక్కెట్టు కొని చూసే రోజులు వస్తే నాటక రంగం ఎంతో అభివృద్ధి చెంది కళా కారులు పది కాలాల పాటు మనుగడ సాగిస్తారని అన్నారు. అది సమాజ చైతన్యానికి ఉపకరిస్తుందని అన్నారు.



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ శ్రావణి

ఉచిత వైద్యశిబిరానికి స్పందన

ప్రజాశక్తి - బాపట్ల

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌కు చెందిన వాస్క్యులర్ హాస్పటల్ సౌజన్యంతో రక్తనాళాల సమస్యలపై ఉచిత వైద్య శిబిరాన్ని పట్టణంలో రోటరీ కళ్యాణ మండపంలో ఆదివారం నిర్వహించారు. శిబిరంలో వంద మందికి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు రోటరీ క్లబ్ అధ్యక్షులు రావూరి వీరరాఘవయ్య తెలిపారు. శిబిరంలో రక్తనాళాల సమస్యలపై పరీక్షించిన పలువురికి రక్తనాళాల రుగ్మతలు ఉన్న దృష్ట్యా అవసరమైన వారికి పూర్తి ఉచితంగా హైదరాబాద్ తీసుకెళ్లి అక్కడ ఆసుపత్రిలో వైద్యం చేసి బాపట్లకు తీసుకొస్తారని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ అనిల్, శ్రావణి, వైద్య శిబిరం చైర్మన్ టి మల్లికార్జునరావు, కార్యదర్శి కె ఉపేంద్ర గుప్తా, కోశాధికారి వి శ్రీనివాసరావు, మోరిశెట్టి సుధీర్ కుమార్, బుర్లె రామ సుబ్బారావు, ఏలూరి హరిబాబు, సుబ్బారావు, శివరామకృష్ణ, ఎస్ రమేష్ బాబు, పి శ్రీమన్నారాయణ పాల్గొన్నారు.



తెలుగు తల్లి విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న నాయకులు

ఆంధ్రోద్యమానికి పురుడు పోసిన బాపట్ల

ప్రజాశక్తి - బాపట్ల

ఆంధ్రోద్యమం బాపట్లలోనే పురుడు పోసుకుందని బాపట్ల ఆహార విజ్ఞాన కళాశాల అసోసియేట్ డీన్ ఆచార్య ఎల్ ఏడుకొండలు అన్నారు. ప్రథమాంధ్ర మహాసభ 111వ వార్షికోత్సవం సందర్భంగా ఫోరం ఫర్ బెటర్ ఆధ్వర్యంలో టౌన్ హాల్ ప్రాంగణంలో శతాబ్ది స్థూపం, తెలుగు తల్లి విగ్రహం వద్ద ఆయన మాట్లాడారు. ఆంధ్రుల స్వరాష్ట్ర వాంఛకు ఇక్కడే బీజం పడిందని అన్నారు. 1913లో బాపట్లలో జరిగిన ప్రథమాంధ్ర మహాసభ 4దశాబ్దాల ఆంధ్రోద్యమానికి నాంది పలికిందని అన్నారు. తెలుగువారి ఐక్యతకు ఊతమిచ్చిన చరిత్ర బాపట్లకు ఉందన్నారు. బాపట్ల మహాసభలు భాషాప్రయుక్త రాష్ట్ర వాదనకు శ్రీకారం చుట్టాయన్నారు. అంధ్ర విశ్వవిద్యాలయ స్థాపనకు కూడా ఇక్కడే బీజం పడిందన్నారు. తెలుగు తల్లి విగ్రహానికి పూల మాల వేసి ఘనంగా నివాళి అర్పించారు. కార్యక్రమంలో ఫోరం కార్యదర్శి డాక్టర్ పిసి సాయిబాబు, కోట వేంకటేశ్వరరెడ్డి, విశ్రాంత ఆచార్యులు కె విజయ కుమార్, జి శాంతరామ్, లక్కాకుల వెంకట్రావు, రమణ కుమార్, జివి, కాగిత కోటేశ్వరరావు, గుదే రాజారావు, వంకాయలపాటి హరిబాబు, మురళి, కరణం రవీంద్ర పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గంధం రవీంధర్

సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి - పర్చూరు

ఓట్ల లెక్కింపు ప్రక్రియలో పాల్గొనే సిబ్బంది అప్రమత్తంగా, బాధ్యతగా పని చేయాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి గంధం రవీందర్ అన్నారు. స్థానిక తహశీల్దారు కార్యాలయ ప్రాంగణంలో ఓట్ల లెక్కంపులో పాల్గొనే సిబ్బంది తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన నియమాలపై అవగాహన కల్పించారు. ఎలాంటి ఆరోపణలకు తావు లేకుండా క్రమ పద్ధతిలో లెక్కింపు ప్రక్రియ అత్యంత జాగ్రత్తతో పూర్తిచేసే విధంగా విధులు నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో ఎఆర్ఒలు, రెవెన్యూ, పిఆర్, విద్యా తదితర శాఖల అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

సిపిఎం సానుభూతి పరుడు సూర్యప్రకాశరావు మృతి

ప్రజాశక్తి-నాగులుప్పలపాడు

నాగులుప్పలపాడు మండలం మద్దిరాలపాడు గ్రామానికి చెందిన సిపిఎం సానుభూతిపరుడు స్వర్ణ సూర్యప్రకాశరావు (66) అనారోగ్యంతో శనివారం రాత్రి మృతి చెందారు. ఆయన మృతదేహాన్ని సిపిఎం రాష్ట్ర నాయకుడు జాలా అంజయ్య, జిల్లా నాయకుడు ఎస్‌కె.మాబు, మండల కార్యదర్శి టి.శ్రీకాంత్ ,జి.బసవపున్నయ్య, కందుల రవి తదితరులు ఆదివారం సందర్శించారు. మృతదేహంపై సిపిఎం జెండా కప్పి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు సూర్యప్రకాశరావు మృతి సిపిఎం నిర్వహించే పోరాటాలకు తీరనిలోటని తెలిపారు. సూర్యప్రకాశరావు తొలి నుంచి సిపిఎం సానుభూతి పరుడుగా ఉంటూ 1980 నుంచి వ్యవసాయ కార్మిక సంఘంలో పనిచేస్తున్నట్లు తెలిపారు. కూలీ పోరాటాలు, రైతు పోరాటాలు, భూపోరాటాల్లో చురుకైన పాత్ర పోషించినట్లు తెలిపారు. పేదలకు ఇళ్ల స్థలాలు, భూములు ఇప్పించేందుకు ఎంతో కష్టి చేశారన్నారు. మాజీ మాజీ ఎమ్మెల్యే తవనం చెంచయ్యతో సన్నిహితంగా మెలగారన్నారు. చెంచయ్య ఆధ్వర్యంలో పేదలకోసం నిర్వహించిన పోరాటాల్లో సూర్యప్రకాశరావు పాల్గొనేవారని తెలిపారు. సూర్య ప్రకాశరావు తుది శ్వాస వరకూ సిపిఎం సానుభూతిపరుడుగా కాలనీలో కామ్రేడ్‌గా పిలవబడ్డారన్నారు ప్రాణాలు కోల్పోయే సమయంలో తమ మృతదేహంపై సిపిఎం జెండా కప్పాలని బంధువులకు చెప్పడం ఆయన నిబద్ధతకు నిదర్శనమని పేర్కొన్నారు. సూర్యప్రకాశరావు ఆశయాలను వారి బంధువులు కొనసాగించాలని సూచించారు.



సూర్య ప్రకాశరావు(ఫైల్)



నివాళులర్పిస్తున్న సిపిఎం నాయకులు

శివారు ప్రాంతాల అభివృద్ధికి కృషి

మున్సిపల్ ఛైర్మన్ అబ్దుల్ గఫార్

ప్రజాశక్తి- కనిగిరి

శివారు ప్రాంతాల అభివద్ధికి కృషి చేస్తామని కనిగిరి మున్సిపల్ ఛైర్మన్ అబ్దుల్ గఫార్ అన్నారు. కనిగిరి పట్టణంలోని బొగ్గులగొంది కాలనీలో మున్సిపల్ ఛైర్మన్ అబ్దుల్ గఫార్ ఆదివారం పర్యటించారు. స్థానికులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అబ్దుల్ గఫార్ మాట్లాడుతూ శివారు ప్రాంతాలు అభివృద్ధి అయితేనే పట్టణం అభివృద్ధి చెందినట్లు అని తెలిపారు. శివారు ప్రాంతంల్లో విద్యుత్తు, తాగునీటి సమస్యలను దశలవారీగా త్వరితగతిన పరిష్కరిస్తామని తెలిపారు. ప్రధానంగా పాముల కాలనీ వాసుల తోడ్పాటు ఇచ్చి వారి అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తున్నామన్నారు. అందుకు స్థానిక అధికారులు సహకరించి శివారు ప్రాంతాల అభివద్ధికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు పసుపులేటి అరుణోదర్,నాగమణి , పాముల కుల సంఘం నాయకురాలు కోటేశ్వరమ్మ ప్రమీల తదితరులు పాల్గొన్నారు.



కాలనీ వాసులతో మాట్లాడుతున్న అబ్దుల్ గఫార్

బాధితులకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి -వెలిగండ్ల

వెలిగండ్ల మండలం మరపగుంట్ల గ్రామానికి చెందిన అంగన్‌వాడీ కార్యకర్త గొర్రె ముచ్చు సలోమి, ఆమె భర్త ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. ప్రస్తుతం వారు నెల్లూరులోని నారాయణ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) గౌరవాధ్యక్షుడు అధ్యక్షులు రాయళ్ళ మాలకొండయ్య ఆదివారం నెల్లూరు వెళ్లి బాధితులను పరామర్శించారు. అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో రూ.18 వేల ఆర్థిక సాయం అందజేశారు. బాధితురాలు సలోమి ఈ నెల 19న తమ కుటుంబ సభ్యులతో కలిసి కనిగిరి నుంచి ఆర్‌టిసి బస్సులో తిరుపతికి బయలు దేరారు. నెల్లూరు జిల్లా బుచ్చిరెడ్డిపాలెం దామరమడుగు వద్ద ఆర్‌టిసి బస్సు లారీని ఢీ కొంది. ఈ ఘటనలో సలోమి, ఆమె భర్త గాయపడ్డారు. ఈ సందర్భంగా రాయళ్ళ మాలకొండయ్య మాట్లాడుతూ రోడ్డు ప్రమాదం గాయపడిన అంగన్‌వాడీ కార్యకర్త సలోమి, దంపతులకు దాతలు ఆర్థిక సాయం అందజేయాలని కోరారు.



ఆర్థిక సాయం అందజేస్తున్న మాలకొండయ్య

మానవత సంస్థకు అండగా నిలవాలి

డాక్టర్ బి హరిబాబు

ప్రజాశక్తి-శింగరాయకొండ

మానవత స్వచ్ఛంద సేవా సంస్థ కు అందరూ అండగా నిలవాలని ప్రముఖ వైద్యులు డాక్టర్ బి.హరిబాబు తెలిపారు. శింగరాయకొండ లోని మానవత కార్యాలయంలో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ హరిబాబు మాట్లాడుతూ సంస్థ ఆశయాలను, సిద్ధాంతాలను ప్రజల్లోకి విస్తతంగా తీసుకెళ్లాలన్నారు. మానవతా స్వచ్ఛంద సంస్థలో ప్రతి ఒక్కరిని భాగస్వామ్యం చేసే బాధ్యత అందరూ తీసుకోవాలన్నారు. సంస్థ ప్రధాన కార్యదర్శి కోటపాటి నారాయణ మాట్లాడుతూ సంస్థ ఆవిర్భావం, అభివద్ధికి సహాయ సహకారాలు అందించిన వారి గురించి వివరించారు. మలినేని లక్ష్మయ్య ఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.తేజోమూర్తి మానవత సంస్థకు ఆర్థిక సహాయం ప్రకటించారు. మానవత స్వచ్ఛంద సేవా సంస్థకు స్వచ్ఛందంగా స్థలం దానం చేసిన దాత శింగరాయకొండ పంచాయితీ వార్డు మెంబర్ గంజి సుబ్బారావు మానవత సంస్థ కు రూ.50 వేల విరాళం ప్రకటించారు. ఈ కార్యక్రమంలో జెట్టి సూర్యచంద్రశేఖర్ రెడ్డి, మహంకాళి నరసింహారావు, మునగపాటి వెంకటరత్నం, ప్రధానో పాధ్యాయులు మద్రి శ్రీనివాసరావు, పి.శ్రీనివాసులు, డివికెవి. ప్రసాదరావు, గుంటక రామలక్ష్మమ్మ, మందలపు బాబూరావు, సుధాకర్‌రెడ్డి, ఉప్పిరెడ్ల శ్రీనివాసరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అబ్దుల్ గఫూర్

పోగొట్టుకున్న సెల్ ఫోన్లు అందజేత

ప్రజాశక్తి-కనిగిరి

పిసిపల్లి మండలం గుదేవారి పాలెం గ్రామానికి చెందిన శ్రీనివసరావు అనే వ్యక్తి తమ గ్రామానికి వచ్చేందుకు గుంటూరులో కనిగిరి డిపోకు సంబంధించిన ఆర్‌టిసి బస్సులో ఎక్కాడు. అనంతరం కనిగిరిలో బస్సు దిగి వెళ్లిపోయారు. అనారోగ్యం కారణంగా కనిగిరిలోని ఒక ప్రవేట్ హాస్పిటల్ కు వెళ్లి చికిత్స చేయించుకున్నాడు. అనంతరం యాపిల్, రెడ్‌మి, కళ్ళజోడును ఎక్కడో మర్చిపోయినట్లుగా గమనించాడు. వివరకూ తాను ప్రయాణం చేసిన బస్సులో మరచిపోయినట్లుగా నిర్ధారించుకున్నాడు. మరో వ్యక్తి ఫోన్ తీసుకొని తన ఫోన్‌కు కాల్ చేశాడు. దీంతో బస్సులో సెల్ ఫోన్ రింగ్ అవడం గమనించిన పార్కింగ్ డ్రైవర్ ఆఫోన్ ను తీసుకోని సెక్యూరిటీ పాయింట్‌లో విధి నిర్వహణలో ఉన్న హెడ్ కానిస్టేబుల్ ఎస్. కొండయ్య అందజేశాడు. అనంతరం బాధితుడితో ఫోన్‌లో మాట్లాడి బస్సులో తనిఖీ చేయగా మరొక సెల్ ఫోను, కళ్ళజోడు సీట్ల మధ్య ఉండడం గమనించి సెక్యూరిటీ పాయింట్‌లో భద్రపరచారు. బస్సులో దిగిపోయిన ప్రయాణికుడి తండ్రి వెంకటేశ్వర్లు డిపో వద్దకు వచ్చి బస్సు వివరాలు టిక్కెట్ వివరాలు తెలిపాడు. కళ్ళజోడు,రెండు ఫోన్లు హెడ్ కానిస్టేబుల్ ఎస్. కొండయ్య ఆయనకు అప్పగించాడు. విలువైన వస్తువులు తిరిగి అప్పగించినందుకు ప్రయాణికుడు తండ్రి వెంకటేశ్వర్లు డిపో మేనేజర్ ,హెడ్ కానిస్టేబుల్, ఆర్‌టిసి సిబ్బందికి ధన్యవాదాలు తెలిపాడు. ఈ కార్యక్రమంలో మెకానిక్ నజీర్ బాషా, పార్కింగ్ డ్రైవర్ పాల్గొన్నారు.



ఫోన్లు అందజేస్తున్న హెడ్ కానిస్టేబుల్ కొండయ్య



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ప్రజాశక్తి- సిఎస్ పురంరూరల్

సిఎస్‌పురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1997 - 2002 విద్యా సంవత్సరాల్లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు ఒకరినొకరు ఆలింగమనం చేసుకుంటూ ఆనందంగా గడిపారు. యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అప్పటి జ్ఞాపకాలను నెమరు వేసుకుంటూ సంతోషంగా గడిపారు. ఆట పాటలతో ఆనందంగా గడిపారు. పాఠశాల అభివద్ధికి తమ వంతు సహకారం అందిస్తామని తెలిపారు. అనంతరం అప్పట్లో తమకు విద్యా బోధన చేసిన ఉపాధ్యాయులు జెఎస్. ఆనంద్ బాబు, సునీత దేవి, గోవిందయ్య, హరిబాబు, చంద్రమౌళి, శర్మను ఘనంగా సన్మానించారు. అనంతరం విద్యార్థులు, ఉపాధ్యాయులు కలిసి సహపంక్తి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



అవార్డు అందుకున్న మద్దాళి

మాధవరావుకు అవార్డు

ప్రజాశక్తి-చీమకుర్తి

చీమకుర్తికి చెందిన అభయ సేవా ఫౌండేషన్ అధ్యక్షుడు మద్దాళి మాధవరావు జీనియస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ అవార్డు అందుకున్నారు. ఒంగోలులో ఎల్‌ఎస్ఇఎస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యఅతిథి మారెళ్ళ సుబ్బారావు చేతుల మీదుగా మాధవరావు అవార్డు అందుకున్నారు.



పాదయాత్ర బందానికి స్వాగతం పలుకుతున్న నాయకులు

శింగరాయకొండకు చేరిన పాదయాత్ర

ప్రజాశక్తి-శింగరాయకొండ

వైసిపి వేమూరు నియోజకవర్గ అభ్యర్థి వరికూటి అశోక్‌బాబు సార్వత్రిక ఎన్నికల్లో విజయం సాధించాలని కోరుతూ చేపట్టిన పాదయాత్ర ఆదివారం శింగరాయకొండకు చేరింది. అందిన వివరాల ప్రకారం... వేమూరు నియోజకవర్గంలోని భట్టిప్రోలు మండలం సూర్య పల్లి గ్రామానికి చెందిన కిరణ్, కళ్యాణ్, సాయి అనే వారు ఎమ్మెల్యే అభ్యర్థి అశోక్‌బాబు, ఎంపీ అభ్యర్థి నందిగం విజయం సాధించాలని కోరుతూ సూర్య పల్లి నుంచి తిరుమలకు పాదయాత్ర చేపట్టారు. ఆ పాదయాత్ర శింగరాయకొండకు చేరింది. ఈ సందర్భంగా పాదయాత్ర బృందం సభ్యులకు స్థానిక వైసిపి నాయకులు ఎర్రమల సుబ్బారావు, రాయి పేర్రాజు, పొంతగాని నరసింహారావు, అడక శ్రీరాములు, రాంబాబు, ఎస్‌కె. కాలేషా, అశోక్ , శివారెడ్డి, జాలిరెడ్డి, పిట్ట బ్రహ్మయ్య ఎస్‌కె. దాదా పూలమాలలు వేసి స్వాగతం పలికారు.

పేరుకే నిషేధం.. జోరుగా వినియోగం

విచ్చలవిడిగా ప్లాస్టిక్ కవర్ల అమ్మకం • పట్టించుకోని అధికార యంత్రాంగం

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

పర్యావరణానికి హాని కలిగించే ప్లాస్టిక్ కవర్ల వినియోగం యర్రగొండపాలెంలో రోజురోజుకూ పెరుగు తోంది. యర్రగొండపాలెం పంచాయతీ పరిధిలో 25 వేల మంది జనాభా ఉన్నారు. వారికి ఏ చిన్న అవసరం వచ్చినా ప్లాస్టిక్ కవర్ల మీదనే ఆధార పడుతున్నారు. ప్రతి చిన్న వస్తువుకు దుకాణాల్లో ప్లాస్టిక్ కవర్లనే ఉపయోగిస్తున్నారు. వీటి వినియోగంపై నిషేధం ఉన్నా యంత్రాంగం నిర్లక్ష్యం వల్ల వీటి అమ్మకం బహిరంగంగానే జరుగుతోంది. ప్రజల్లో అవగాహన లేకపోవడం, అధికారులు చూసీచూడనట్లు వ్యవహరించడం వల్ల వీటి వినియోగం ఆగడం లేదు. ప్రచార ఆర్భాటమే తప్ప అమల్లో ప్రభుత్వం విఫలమవు తోందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నా స్పందన ఉండటం లేదు. గతంలో పలు స్వచ్ఛంద సంస్థలు, ప్రభుత్వ అధికారులు పాలిథిన్ కవర్ల వాడకంపై ప్రజలను చైతన్య పరిచేవారు. ప్రస్తుతం దీన్ని ఎవరూ పట్టించుకోవడం లేదు. గతంలో ప్రభుత్వం ప్లాస్టిక్ కవర్లపై నిషేధం విధించినా దాన్ని క్షేత్రస్థాయిలో అధికారులు మాత్రం వదిలేశారు. ప్లాస్టిక్ వాడకం, అమ్మకాలు జరగకుండా చర్యలు చేపట్టి పర్యావరణాన్ని పరిరక్షించాలని పర్యావరణవేత్తలు వేడుకుంటున్నారు.



ప్లాస్టిక్ కవర్లు



రోడ్డు పక్కనే ప్లాస్టిక్ కవర్ల చెత్త

పర్యావరణానికి ముప్పు

షేక్ కరిముల్లా, యర్రగొండపాలెం



ప్లాస్టిక్ వినియోగం వల్ల పర్యావరణానికి ముప్పు వాటిల్లుతోంది. సకాలంలో వర్షాలు కురవక కరువు పరిస్థితులు ఏర్పడుతున్నాయి. వీటి వాడకం వల్ల కలిగే అనర్థాలను ప్రజలకు వివరించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలి. నీటి కాలుష్యం ఎక్కువగా జరుగుతోంది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ప్లాస్టిక్ వస్తువుల వాడకాన్ని అరికట్టకపోతే రానున్న రోజుల్లో దుర్భర పరిస్థితులు ఎదుర్కోక తప్పదు.

ప్రకటనలకే పరిమితం

డాక్టర్ పి జాషువా, యర్రగొండపాలెం



ప్లాస్టిక్ పదార్థాల వాడకాన్ని పూర్తిగా నిషేధించామంటూ పాలకులు గొప్పలు చెబుతున్నా విక్రయాలు మాత్రం యథేచ్ఛగా సాగుతున్నాయి. పాలిథిన్ కవర్ల నిషేధం క్షేత్రస్థాయిలో ఎక్కడా అమలు కావడం లేదు. వర్షాలు సక్రమంగా పడకపోవడం వల్ల భూగర్భ జలాలు అడుగంటి తాగు, సాగు నీటికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితి ఎదురవుతోంది.

ప్రజల్లో చైతన్యం తప్పనిసరి

కొమర కోటేశ్వరరావు, కిరాణా మర్చంట్, యర్రగొండపాలెం



పాలిథిన్ కవర్లు, ప్లాస్టిక్ వస్తువుల వాడకం వల్ల కలిగే అనర్థాలను ప్రజలకు వివరించి చైతన్యపరిస్తే వారిలో కొంతైనా మార్పు వస్తుంది. ప్లాస్టిక్ వినియోగంపై ప్రభుత్వాలు ఇస్తున్న ఆదేశాలు అమలుకు నోచుకోవట్లేదు. అన్నింటా కాలుష్యంతో మనుగడకే ముప్పు వాటిల్లుతోంది. ప్రభుత్వ ఆదేశాలు పక్కాగా అమలయ్యేలా చర్యలు తీసుకుంటే కాలుష్యాన్ని కొంతవరకైనా నివారించుకోగలిగిన వాళ్లం అవుతాం.

అమ్మకాలపై చర్యలు తీసుకుంటాం

ఈదుల రాజశేఖర్‌రెడ్డి, ఈవోఆర్‌డి, యర్రగొండపాలెం



ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ప్లాస్టిక్ అమ్మకాలు జరగకుండా చర్యలు చేపడతాం. పంచాయతీల్లో ఎక్కడ అమ్మకాలు చేపట్టినా చర్యలు తీసుకునేలా కార్యదర్శులకు ఆదేశాలు జారీ చేస్తాం. ప్లాస్టిక్ అమ్మకాలు సాగించే వారిపై చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వం ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించిందన్న విషయాన్ని గుర్తుంచుకోవాలి. అక్రమంగా అమ్మకాలు సాగించినట్లు తెలిస్తే చర్యలు తప్పవు.



కబడ్డీ ఆడుతున్న విద్యార్థులు

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

ప్రతి విద్యార్థి వేసవి శిక్షణలో భాగంగా గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని యర్రగొండపాలెం గ్రంథపాలకురాలు కటికల ఝాన్సీ కోరారు. ఈ సందర్భంగా ఆదివారం ఆమె మాట్లాడుతూ గ్రంథాలయం ఒక పుస్తక భాండాగారమని, ప్రతి విద్యార్థీ పుస్తకాలు చదవడం అలవాటు చేసుకోవాలని అన్నారు. పుస్తక పఠనం ప్రతి ఒక్కరినీ మంచి మార్గంలో నడిపి మంచి ప్రవర్తనను తీసుకువస్తుందని తెలిపారు. అనంతరం విద్యార్థులకు పలు అంశాలపై వక్తృత్వ పోటీలు నిర్వహించారు. కబడ్డీ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు.

వేసవి శిక్షణా తరగతులు

ప్రజాశక్తి-పెద్దదోర్నాల



శిక్షణా తరగతులు నిర్వహిస్తున్న గ్రంథపాలకుడు

పెద్దదోర్నాల శాఖా గ్రంథాలయంలో ఆదివారం గ్రంథపాలకుడు డి వెంకట సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో వేసవి శిక్షణ తరగతులను నిర్వహించారు. 20 మంది విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థులకు కథలు చదివించడం, కథలు చెప్పించడం, కోకో, డ్యాన్స్, గాలిపటాలు తయారు చేయడంలో మెలకువలు నేర్పించారు. ఈ కార్యక్రమంలో వివిధ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.



శిక్షణా శిబిరంలో పాఠం బోధిస్తున్న ఉపాధ్యాయుడు సూర్య

శిక్షణలో జిల్లాల విభజనపై అవగాహన

ప్రజాశక్తి-సంతనూతలపాడు

స్థానిక శాఖా గ్రంథాలయంలో ఆదివారం నిర్వహించిన వేసవి శిక్షణా శిబిరంలో పాత కొత్త జిల్లాల ఏర్పాటు, విభజన గురించి ఉపాధ్యాయుడు సూర్య క్లాసు బోధించారు. 12వ రోజు శిక్షణ ప్రారంభంలో పిల్లల చేత కథలు చెప్పించడం, కథలు చదివించడం చేశారు. తరువాత చదరంగం, స్కిప్పింగ్, క్యారమ్, ల్యూడో స్నేక్ ఆటలను ఆడించారు. అనంతరం నీతి కథలు, పొడుపు కథలపై శివరామకృష్ణ క్లాసు బోధించారు. నీతి కథలు, పొడుపు కథలపై పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. అనంతరం పిల్లలకు బిస్కెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథపాలకుడు కె సత్యనారాయణ పాల్గొన్నారు.

ఘనంగా వేణుగోపాలస్వామి గరుడోత్సవం

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెం సమీపంలోని మిల్లంపల్లి రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి వార్ల బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం గరుడ వాహనం ద్వారా దేవతామూర్తులను యర్రగొండపాలెం పట్టణంలో ఊరేగించారు. ఒంగోలు వంశస్తులచే జగజ్యోతి బండి కట్టారు. దేవాలయం దగ్గర అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆలయ ఈవో ఈదుల చెన్నకేశవరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పూజారి అన్నమరాజు రమేష్‌బాబు ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉభయదాతలు, గ్రామస్తులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

మెజారిటీపై ఇరు పార్టీల ధీమా..

త్రిపురాంతకం మండలంలో నువ్వా.. నేనా

ప్రజాశక్తి-త్రిపురాంతకం: సార్వత్రిక ఎన్నికలు ముగిసిన తర్వాత అభ్యర్థులకు గుబులు పట్టుకుంది. ఓట్ల లెక్కింపునకు కొద్దిరోజులే గడువు ఉండడంతో టిడిపి కూటమి, వైసిపి నాయకులు ఎవరి అంచనాల్లో వారున్నారు. ఇరు పార్టీల నేతలు గెలుపు మాదంటే మాదని గాంభీర్యం ప్రదర్శిస్తున్నారు. అయినప్పటికీ వారిలో భయం వెంటాడుతోంది. పైకి మాత్రం కనీసం త్రిపురాంతకం మండలంలో రెండు వేల నుంచి మూడు వేల మెజార్టీతో విజయం సాధిస్తామని వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి తాటిపర్తి చంద్రశేఖర్ వర్గీయులు ధీమా వ్యక్తం చేస్తుండగా, 3,500 మెజార్టీ తన పార్టీకే వస్తుందని టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి గూడూరి ఎరిక్షన్‌బాబు వర్గీయులు బల్ల గుద్ది చెబుతున్నారు. అంతర్గతంగా మాత్రం ఇరు పార్టీల్లో ఎవరికి స్పష్టమైన మెజార్టీ వస్తుందో తెలియక సతమతమవుతున్నారు. దీనికి కారణం ప్రధానంగా ఓటింగ్ శాతం పెరగడం, ఎక్కువగా మహిళలు రాత్రి తొమ్మిది గంటలు అయినప్పటికీ క్యూలో నిల్చొని ఓటు హక్కు వినియోగించుకోవడమేనని భావిస్తున్నారు.

త్రిపురాంతకం మండలంలో..

త్రిపురాంతకం మండలంలో మొత్తం 48,836 ఓట్లు కాగా 43,365 ఓట్లు పోలయ్యాయి. 88.79 శాతం ఓటింగ్ జరిగింది. జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ, టిడిపి పార్టీలు ఎన్నికలను త్రిపురాంతకం మండలంలో ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. మంత్రి సురేష్ నియోజకవర్గంలో ఉన్నన్ని రోజులు పార్టీకి దూరంగా ఉన్న వర్గం తాటిపర్తి రాకతో ఒక్కటయ్యారు. అలాగే టిడిపిలో కూడా పాత వర్గమంతా కలిసిపోయింది. ఎరిక్షన్‌బాబుకు జై కొట్టారు. ఈ క్రమంలో ప్రధాన పార్టీల అభ్యర్థులను పక్కన పెట్టి మండల స్థాయిలోని ప్రధాన నేతలు నువ్వా..నేనా అన్నట్లు పోటీ పడ్డారు. దీంతో మండలంలో ఉత్కంఠ నెలకొంది. మండలాల్లో వార్డుల వారీగా, పంచాయతీల వారిగా ఆయా బూత్‌లలో ఎంత పోలింగ్ జరిగింది.. ఎన్ని ఓట్లు వస్తాయని లెక్కలు వేసుకుంటున్నారు. ఎంత మెజార్టీ వస్తుందో అని చర్చలు జరుపుకుంటున్నారు.

ఎవరి లెక్కలు వారివే..

ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకతతోనే భారీగా పోలింగ్ జరిగిందని, మెజార్టీపై కూటమి నేతలు ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఎన్నడూ లేని విధంగా ఈ ఎన్నికల్లో యువత, ఉద్యోగులు, మహిళలు అత్యధికంగా ఓటు వేశారని చెబుతున్నారు. వైసిపి వర్గాలు మాత్రం వైసిపి ప్రభుత్వం చేసిన మంచి పనులే మండలంలో తమకు మెజార్టీ తెస్తాయని చెబుతున్నారు. ఏది ఏమైనా త్రిపురాంతకం మండలంలో మెజార్టీ పై వైసీపీ, టిడిపి నేతలతో పాటు ఓటర్లు కూడా ఎంతో ఆసక్తి కనబరుస్తున్నారు. ఈ ఉత్కంఠ తొలగిపోవాలంటే జూన్ 4 వరకు వేచి చూడాల్సిందే.

ఒకటికి పది రెట్లు..

కాయ్ రాజా కాయ్ • అభ్యర్థుల గెలుపుపై బెట్టింగుల జోరు

ప్రజాశక్తి-మార్కాపురం

ఓట్ల లెక్కింపు సమయం దగ్గర పడుతోంది. జూన్ 4కు మరో ఎనిమిది రోజులు మాత్రమే ఉంది. లెక్కింపు తేదీ దగ్గర పడేకొద్దీ మార్కాపురంలో బెట్టింగులు కూడా పెరుగుతున్నాయి. మార్కాపురంలో బెట్టింగు రాయుళ్లు రాష్ట్ర వ్యాప్తంగా పలు నియోజకవర్గాలపై పందెం కాస్తున్నారు. ప్రభుత్వం మీద అదే విధంగా బెట్టింగ్‌లు జరుగుతున్నాయి. ఆశ్చర్యకరమైన పందేలు కూడా మార్కాపురంలోనే జరుగుతున్నాయి. ఒకటికి పది రెట్లు ఇచ్చే విధంగా పందెం జరిగింది. మార్కాపురం పట్టణం అంతా ఇదే చర్చ జరుగుతోంది. ప్రకాశం జిల్లాలో మూడు ఎస్సీ నియోజకవర్గాలు ఉన్నాయి. వాటిలో మూడు స్థానాల్లో వైసిపి గెలుస్తుందని ఒకరు... వాటిలో ఏ ఒక్కటైనా ఓడిపోతుందని మరొకరు పందెం పెట్టుకున్నారు. వైసిపి మూడింటిలో గెలిస్తే రూ.10 లక్షలు వైసిపి తరపున బెట్టింగ్ పెట్టిన వ్యక్తికి చెల్లించాలి. అందులో ఏ ఒక్కటి ఓడినా టిడిపి తరపున బెట్టింగ్ పెట్టిన వ్యక్తికి రూ.లక్ష ఇవ్వాలని ఒప్పందం కుదుర్చుకున్నారు. యర్రగొండపాలెం, కొండపి, సంతనూతల పాడు నియోజకవర్గాలపై ఈ పందెం జరిగింది. ఈ పందెం కాసిన వారిద్దరూ మిత్రులే. ఒకరు వైసిపి, మరొకరు టిడిపి అభిమానిగా ఉన్నారు. వీరిద్దరూ నిత్యం ఆ మూడు నియోజకవర్గాల్లో ఎలా ఓటింగ్ జరిగింది. ఎవరికి లాభం అనే లెక్కల్లో మునిగారు. ఆ పందెంలో ఎవరు నెగ్గుతారో జూన్ 4వ తేదీన తేలిపోనుంది.!

భారీ స్థాయిలో బెట్టింగులు

ప్రజాశక్తి-పిసిపల్లి

మే 13న జరిగిన ఎన్నికల్లో ఇరు పార్టీల వారు గెలుపుపై కాకుండా మెజారిటీపై భారీగా బెట్టింగ్‌లు పెడుతున్నారు. ఇరు పార్టీల వారు గెలుపుపై ధీమాగా ఉన్నారు. మెజారిటీల మీద భారీగా బెట్టింగ్‌లు పెడుతున్నారు. పోలింగ్ శాతం ఎక్కువగా ఉండడంతో తమకే ఓట్లు ఎక్కువ వేశారన్న ధీమా ఇరు పార్టీల మధ్య కనిపిస్తోంది. ఎన్నికల సమయంలో పంచిన డబ్బులు, వలస ఓటర్లను తీసుకొచ్చిన దానిని అంచనా వేసుకొని మండలం మొత్తం మీద కోటికిపైగా బెట్టింగ్ పెట్టినట్లు సమాచారం. మండలం మీద మెజారిటీపై కొందరు, బూత్‌ల వారీగా మరికొందరు పోటీ పడుతున్నారు. వలస ఓటర్ల కోసం నాయకులు భారీగానే డబ్బులు గుంజారు. కానీ వారు ఎటు వైపు వేసినా తామే పిలిపించామని నాయకులు చెప్పడంతో ఇరువర్గాల వారు గెలుపుపై ధీమాగా ఉన్నారు. ఈ విధంగా ఒకటికి రెండు రెట్లు, మూడు రెట్లు అంటూ బెట్టింగ్‌లు పెడుతున్నారు. లక్షకు తగ్గకుండా బెట్టింగ్ డబ్బులు మధ్యవర్తుల వద్ద ఉంచుతున్నట్లు సమాచారం.

నేటికీ పొలాల్లోనే వైట్‌బర్లీ లేత పొగాకు

మారిన వాతావరణంతో రైతుల్లో ఆందోళన

ప్రజాశక్తి - ఇంకొల్లు

ఏడాది మే నెల ముగిసి మళ్ళీ ఏడాది ఖరీఫ్ పంట కాలం సమీపిస్తుంది. జూన్ నెల వస్తున్న ఇంకా పొలాల్లోనే వైట్ బర్లీ లేత పొగాకు తోటలు కొట్టుడుకు వచ్చి కనిపిస్తున్నాయి. సంవత్సరం ప్రారంభం నుంచి వైట్ బర్లీ పొగాకు ధర ఆశాజనకంగా ఉండటంతో పాటు మొదట్లో మిచంగ్ తుఫానుకు తోటలు కొన్ని దెబ్బతిన్నాయి. అక్కడక్కడ పత్తి సాగు చేసిన పొలాల్లో పత్తి ఎర్ర గులాబీ పురుగుసోకి దెబ్బ తినడంతో పత్తి తొలగించి పొగ తోటలు రబిలో లేత తోటలు ఆలస్యంగా సాగు చేశారు. ఆ తోటలకు అనంతరం సంభవించిన వాతావరణ పరిణామాలతో సుదూర ప్రాంతాల నుంచి అధిక వ్యయం చేసి నీటి తడులు ట్యాంకర్ల ద్వారా, ఆయిల్ ఇంజన్ ద్వారా ఇచ్చారు. ఆ తోటలు డిసెంబర్, జనవరి నెలల్లో సాగు చేయటంతో తడిపిన కొట్టుడుకు ఇప్పటివరకు పూర్తిగా


హనుమోజుపాలెంలో కొట్టుడుకు వచ్చిన లేత పొగతోట

రాలేదు. ఇలాంటి లేత పొగ తోటలు ఇంకొల్లు, కారంచేడు, మార్టూరు మండలంలోని హనుమజీపాలెం, జరుబులవారి పాలెం, కేశవరప్పాడు, తిమర్ధపాడు, ఇంకొల్లు తదితర గ్రామాల్లో ఇప్పటికీ పొలాల్లో తోటలు దర్శనమిస్తున్నాయి. ఆ లేత తోటల్లో అడుగు ఆకులు మాత్రమే కొట్టుడు కొట్టి పందిళ్లకు ఆకు ఎక్కించారు. ప్రధాన ఆకు కొట్టుడు, చివరికొట్టుడు ఇక కొట్టవలసి ఉంది. ఆలస్యంగా సాగు చేయడంతో ఆకు ఇంకా పక్వానికి రాలేదు. దీనికి తోడు మొన్నటి వరకు మండుతున్న ఎండలతో రైతులు సతమతమైతే మరోవైపు ప్రస్తుతం గత రెండు రోజులుగా మారిన వాతావరణంతో వర్షం పడుతుందని, వర్షం పడితే ఆకు రంగు మారుతుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనికి తోడు ఇప్పటికే పందిళ్లకు ఎక్కిన అడుగు ఆకు తడిసి పాడైపోతుందన్న ఆందోళనతో సాగుదారులు వాపోతున్నారు. ఇప్పటికే లేత పొగ తోటలకు అధిక ఖర్చు అవ్వడంతో పాటు దిగుబడి తగ్గనుందని, దీనికి తోడు వర్షానికి ఆకు తడిస్తే మడ్డి కారిపోతుందని, రంగు పోతుందని రైతులు అంటున్నారు. ముదురు పొగకు రైతుల ఇళ్ల వద్ద నిల్వ ఉ%శీ%దని, మార్కెట్ ధర ప్రస్తుతం నిలకడగా రూ.15వేలు ఉన్నప్పటికీ లేత తోటలకు ఈ ధర గిట్టుబాటు కాదని రైతులు వాపోతున్నారు.

భానుడి భగభగ.. ప్రజల బెంబేలు

- 42డిగ్రీలకు పైగా నమోదుకానున్న ఉష్ణోగ్రతలు
- వర్షం కురిసిందనుకునేలోపు ముదిరిన ఎండలు
- ఉదయం 8 గంటల నుండే భానుడి ప్రతాపం
- వృద్ధులు, చంటి పిల్లలతో జాగ్రత్తగా ఉండాలన్న వైద్యులు

ప్రజాశక్తి - చీరాల

అసలే వేసవి కాలం. పైగా నిప్పుల కొంపటిలా మండుతున్న ఎండలు. అంతేకాకుండా సాధారణ ఉష్ణోగ్రతకు మించి 40డిగ్రీల వరకు నమోదవుతున్న ఎండ, వడ గాలులు. ఇలాంటి పరిస్థితుల్లో సాధారణంగా జనం ఇళ్లల్లో నుంచి బయటికి రావాలంటే హడలిపోతున్న పరిస్థితి ఏర్పడింది. ఉదయం 8 గంటలకే ఎండ వేడి 36నుండి 40డిగ్రీలపైగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. అయితే ఇలాంటి తరుణంలో ఏదైనా లాంగ్ టూర్ వెకేషన్ ప్లాన్ చేసే వారికి కొన్ని హెచ్చరికలు చేస్తున్నారు. నిపుణులు సాధారణంగా వేసవి కాలం అంటే పిల్లలకు సెలవు రోజులు. మధ్యాహ్నం సమయంలో ఇంట్లో నుంచి బయటకు వచ్చామంటే కచ్చితంగా వడదెబ్బ తగిలి మంచం పట్టాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. ఇలాంటి పరిస్థితుల్లో పట్టణ ప్రజలు బయటికి రావాలంటే బెంబేలెత్తుతున్నారు. ప్రయాణాలు వాయిదా వేసుకుంటూన్నారు. వ్యాపారులు సైతం మధ్యాహ్నం వేళలో దుకాణాలు ముసివేస్తూ చల్లబడ్డాక తిరిగి వ్యాపారాలు కొనసాగిస్తున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో బయటికి వచ్చేవాళ్లు ఉదయం లేక సాయంత్రం వేళలో మాత్రమే బయటకు వస్తున్నారు.


ఎండ ప్రభావంతో నిర్మానుషంగా గడియార స్థంభం రోడ్డు

వడదెబ్బ లక్షణాలు

చర్మం జిడ్డుగా, రంగు పాలిపోయినట్లుగా, ఎర్రగా మారిపోతే వడదెబ్బ తగలబోతోందని అర్థం. చెమటలు బాగా పడతాయి. తలనొప్పి వస్తుంది. వికారంగా ఉంటుంది. కళ్లు మసగ్గా అవుతాయి. నీరసం వస్తుంది. కిందపడిపోతారు. అప్పుడు నీరు బాగా తాగాలి. లేదా ఎవరైనా తాగించాలి. వడదెబ్బ తగిలిన వ్యక్తిని చల్లటి నీడ ప్రదేశానికి తీసుకెళ్లాలి. బట్టలు బిగుతుగా ఉంటే వదులుగా చెయ్యాలి. చర్మంపై చల్లటి, తడి బట్టను ఉంచాలి. కొద్ది కొద్దిగా నీరు తాగించాలి. వాంతులు అవుతుంటే, అపస్మారక స్థితిలోకి వెళ్తుంటే వెంటనే డాక్టర్ దగ్గరకు తీసుకెళ్లాలి. వేసవి తాపాన్ని తట్టుకోవాలంటే దాహం వేసినా, వేయకున్నా నీరు తాగాలని, తాజా పండ్లు తినాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. అలాగే మసాలా వంటకాలకు, శీతల పానియాలకు ఎంత దూరం ఉంటే అంత మంచిదని అంటున్నారు. బయటకు వెళ్ళాల్సి వస్తే సన్‌స్టోన్ లోషన్ రాసుకోవాలని, టోపీ, గొడుగు లాంటివి తప్పక తీసుకెళ్లాలని తెలిపారు. చిన్నపిల్లలు, వృద్ధుల పట్ల జాగ్రత్త వహించాలని అంటున్నారు.

వడదెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు

వేసవి కాలంలో ద్రవ పదార్థాలు తగిన మోతాదులో తీసుకోకుంటే ఆరోగ్య సమస్యలతోపాటు ప్రాణానికి ప్రమాదం. వడదెబ్బతో పల్స్ రేట్ పెరిగి, శ్వాస పీల్చడం కష్టమవుతుంది. వేడి బారి నుంచి రక్షణ పొందటానికి కూలర్ కింద, నీడపట్టున ఉండాలంటారు. ఎండలో తిరిగే జాగ్రత్తలు తీసుకోవాలని అంటున్నారు. శరీరానికి నీరిచ్చే పుచ్చకాయ లాంటి ఆహారంతో పాటు ద్రవ పదార్థాలు ఎక్కువగా తీసుకోవాలి. సోడా తాగొచ్చు. వ్యాయామం చేసేటట్లయితే దానికి ముందు ఎక్కువ నీరు తాగటం మంచిది. మీరు విమాన ప్రయాణం చేస్తున్నట్లయితే అధికంగా నీరు తాగటం మర్చిపో వద్దు. పనికి వెళ్లే వారు అధికనీరు తాగటంతోపాటు నీళ్లబాటిల్ వెంట ఉంచు కోవట మంచిది. ఎండ వేడిమి వల్ల మీ శరీరంపై చెమట కాయలు వచ్చే అవకాశముంది. దీని బారి నుంచి రక్షణ పొందటానికి వేసవిలో ప్రిక్లీహీట్ పౌడరును వాడితే మంచిది.

పిల్లలు ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి అవసరం


డాక్టర్ జి రాజ్‌కుమార్ (చిన్న పిల్లల వైద్య నిపుణులు)

పసిపిల్లలకు వేసవి కాలంలో అనేక సమస్యలు ఎదురవుతాయి. ఈ సీజన్‌లో ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. బయటకు వచ్చేటప్పుడే గొడుగు సాయం ఎంతో అవసరం. అధిక ఎండ వలన డీహైడ్రేషన్ ప్రభావం పొంచి ఉంటుంది. ఫంగస్, చెమట వల్ల చర్మ ఇన్ఫెక్షన్ల తీవ్రత కూడా ఎక్కువగానే ఉంటుంది. అతిసార తదితర రుగ్మతలు పసిపిల్లలకు సమస్యలు సృష్టిస్తాయి. ఎండ అధికంగా ఉండే సమయంలో పిల్లల్ని బయటికి పంపకూడదు. పలుచని కాటన్ దుస్తులే ధరించాలి. ఓఆర్ఎస్, కొబ్బరినీళ్లు, పళ్లరసాల వంటి ద్రవపదార్థాలు తీసుకోవాలి. కాచి చల్లార్చిన నీళ్లే తాగడం ఆరోగ్యం. చర్మం మీద వేడి పొక్కులు వస్తే కాలమైన్ లాంటి లోషన్లు వాడాలి. జ్వరం, నీరసం, వికారం లాంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే నిపుణులను సంప్రదించాలి. అవసరమైతే తప్ప పిల్లల్ని బయటికి తీసుకు రావద్దు.

కూరపాటి సంస్మరణ సభ

ప్రజాశక్తి వేటపాలెం


చిత్రకారుడు వెంకట్రావు సంస్మరణ సభలో వక్తలు

విద్యార్థులను చిత్రకారులుగా తీర్చిదిద్దిన ఘనత కూరపాటి వెంకట్రావుకు దక్కుతుందని పలువురు వక్తలు కొనియాడారు. ఓఆర్ఎస్ పాఠశాల్లో కూరపాటి వెంకట్రావు సంస్కరణ సభ ఆదివారం నిర్వహించారు. సభకు పందిళ్ళపల్లి జెడ్‌పి హై స్కూల్ హెచ్ఎం బట్టిప్రోలు వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ బాల, బాలికలను చిత్రకారులుగా తీర్చి దిద్దటంలో అవిశ్రాంతంగా పని చేశారన్నారు. చిత్రకారులు పద్మారావు మాట్లాడుతూ చిత్రలేఖనం ఉపాధ్యాయునిగా కొనసాగినప్పటికీ కల్పనా ఆర్ట్స్ అధినేతగా అనేక చిత్రాలు చిత్రించారని అన్నారు. కూరపాటి వెంకటరావు మరణం తీరని లోటని, ఆయన సేవలు మరువలేనివని గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో సిహెచ్ యల్లమందారెడ్డి, కూరపాటి నారాయణ, కర్న బాలానందం, ఉపాధ్యాయులు కోడే శ్రీనివాసరావు, పింజుల శ్రీనివాసరావు, చిత్రలేఖనం కళాకారులు శేఖర్ ఆర్ట్స్ పాల్గొన్నారు.

1, 2 తేదీల్లో సాహిత్య శిక్షణ

ప్రజాశక్తి - అద్దంకి

టిటిడి దాస సాహిత్య ప్రాజెక్టు ఆద్వర్యంలో బజన మండలి సభ్యు లకు జూన్ 1, 2 తేదీల్లో టిటిడి దాస సాహిత్య ప్రాజెక్టు విశేసాధి కారి గురువు పగడాల ఆనంద తీర్ధా చార్యులు ఆద్వర్యలో ఉమ్మడి ప్రకాశం, గుంటూరు జిల్లాల కో ఆర్డినేటర్ చెన్నుపల్లి నాగేశ్వరరావు నేతృత్వంలో శిక్షణ ఏర్పాటు చేశారు. జూన్ 1న శింగరకొండలోని టిటిడి కల్యాణ మండపంలో శిక్షణ జరుగుతుందని తెలిపారు. గురువులు, బజన మండలి సభ్యులు, సంకీర్తనలో శిక్షణ, కొలాటం, బజన, చెక్కబజన టీంలకు తిరుపతి దేవస్థానం రిజిస్ట్రేషన్ చేయనున్నట్లు తెలిపారు. జిల్లాలోని బజన బృందాలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమ కరపత్రాన్ని కాకానిపలెంలోని శ్రీ రంగనాయక స్వామి దేవస్థానం వద్ద టిటిడి దాస సాహిత్య ప్రాజెక్టు ఉమ్మడి జిల్లాల కోఆర్డినేటర్ చెన్నుపల్లి నాగేశ్వరరావు ఆద్వర్యంలో ధర్మవరపు శ్రావణ్ కుమార్ మాస్టారు, కాకాని కోటేశ్వరమ్మ, మురగొండి విజయమ్మ, మాదాల దానయ్య, వెంకటాద్రి, జాస్టి వెంకటేశ్వర్లు, అనంతరెడ్డి ఆవిష్కరించారు. కూచి వీరబ్రహ్మాం, అంజమ్మ, లక్ష్మి, సుబ్బయమ్మ, బ్రహ్మయ్య పాల్గొన్నారు.

పర్చూరు : స్థానిక శ్రీ అద్దంకి నాంచారమ్మ తిరునాళ్ల సందర్భంగా అమ్మవారికి లక్ష మల్లెలార్చన పూజలు ఆదివారం నిర్వహించారు. ప్రముఖ వ్యాపార వేత్త నర్రా వెంకటలక్ష్మీ, సుధా దంపతుల ఆర్థిక సహాయంతో ప్రతిఏటా అమ్మవారికి మల్లెపూల అర్చన నిర్వహిస్తుం టారు. ఆలయ ఇఒ సనిమెళ్ళ కోటిరెడ్డి, కొల్లా పెదకాపు, వంశ పారంపర్య అర్చకులు తులసి బిక్షాలు పాల్గొన్నారు.


గ్రంథాలయంలో శిక్షణా తరగతుల్లో విద్యార్థులు

గ్రంథాలయంలో విజ్ఞాన తరగతులు

ప్రజాశక్తి - సంతమాగులూరు

వేసవి విజ్ఞాన శిక్షణా తరగతుల్లో విద్యార్థులకు పుస్తక పఠనం ఎంతో మేలు జరుగుతుందని గ్రంథపాలకుడు బాదం విజమభాస్కరరెడ్డి తెలిపారు. గ్రంథాలయ శాఖలో 9వ రోజు వేసవి శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ తరగతుల్లో విద్యార్థులకు ఆంగ్లంలో మాట్లాడడం, కథలు చెప్పటం, చిత్రలేఖనం, వంటి అంశాలపై శిక్షణ ఇచ్చారు. రిటైర్డ్ లెక్చరర్ ఎండి అల్తాఫ్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

అపస్మారక స్థితిలో కార్మికుడు

ప్రజాశక్తి - అద్దంకి


పారిశుద్ధ్య కార్మికుడు అంజిబాబు

నగర పంచాయతీ పారిశుద్ధ్య కార్మికుడు జి అంజిబాబు విధుల్లో భాగంగా కలవకూరు రోడ్డులోని ఒక బహుళ అంతస్తు భవనం వద్ద విధులు నిర్వహిస్తున్న సమయంలో ట్రాక్టర్‌కు చెత్త వేసే సమయంలో ఒక్కసారిగా కుప్పకూలి పోయాడు. సహచర కార్మికులు వెంటనే 108వాహనానికి సమాచారం అందించడంతో ప్రభుత్వ వైద్యశాలకు తరలిం చారు. మెరుగైన వైద్యం కోసం ఒంగోలు తరలించారు.


సూచనలిస్తున్న సిఐ సీతారామయ్య

చెంచుకాలనీలో కార్డెన్ అండ్ సెర్చ్

ప్రజాశక్తి - పర్చూరు

కక్షలు, కార్పన్యాలతో జీవితాన్ని బలి చేసుకోవద్దని సిఐ సిహెచ్ సీతారామయ్య పేర్కొన్నారు. ఎస్‌పి వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు స్థానిక చెంచుల కాలనీలో కార్టన్ అండ్ సెర్చ్ నిర్వహించారు. ఓట్ల లెక్కింపు సందర్భంగా ఎలాంటి వివాదాలకు పాల్పడవద్దన్నారు. చట్టాలను అతిక్ర మించి శాంతి భద్రతలకు విఘాతం కలుగ చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. క్షణికా వేశాలకు గురై జీవితాలు పాడు చేసుకోవద్దని సూచించారు. దుర్యసనాలకు లోను కాకుండా ఆదర్శవంతంగా జీవితాన్ని గడపాలని కోరారు. ఎస్ఐ ఆర్ రమేష్, ఎఎస్ఐ కోటేశ్వరరావు పాల్గొన్నారు.


ఎస్ఐ జివి చౌదరి ఆధ్వర్యంలో కార్టన్ అండ్ సెర్చ్

యద్దనపూడి : మండలంలోని అనంతవరంలో ఆదివారం రాత్రి ఎస్ఐ జివి చౌదరి ఆధ్వర్యంలో కార్టన్ అండ్ సెర్చ్ నిర్వహించారు. ప్రతి ఒక్కరు నియమ నిబంధనలకు అనుగుణంగా నడచు కోవాలని చెప్పారు. కార్యక్రమంలో ఎఎస్ఐ శ్రీనివాసరావు, హెడ్ కానిస్టేబుల్ కోటేశ్వరరావు, సిబ్బంది శివ కృష్ణ, నాగరాజు, వెంకయ్య పాల్గొన్నారు.

డిజిటల్ వాల్యుయేషన్‌తో

వేగవంతంగా ఫలితాలు

- ఆర్ఐఓ సైమన్ విక్టర్
- రెండో విడత అధ్యాపకులకు శిక్షణ

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

డిజిటల్ వాల్యుయేషన్‌తో తప్పులు లేకుండా పూర్తి చేయవచ్చుని, వేగవంతంగా పరీక్ష ఫలితాలను ప్రకటించవచ్చని ప్రాంతీయ పర్యవేక్షణ అధికారి ఏ.సైమన్ విక్టర్ పేర్కొన్నారు. ఒంగోలు ఏకెవికె జూనియర్ కళాశాలలో డిజిటల్ వాల్యుయేషన్‌పై జిల్లాలోని ప్రైవేట్, అన్‌ఎయిడెడ్, జనరల్ మరియు ఒకేషనల్ జూనియర్ కళాశాలల యాజమాన్యాల నుంచి అధ్యాపకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆర్ఐఓ మాట్లాడుతూ డిజిటల్ వాల్యుయేషన్‌తో పరీక్షా ఫలితాలు కూడా వేగవంతంగా ప్రకటించవచ్చని తెలిపారు. ఈ డిజిటల్ వాల్యుయేషన్‌తో సమయం ఆదా అవుతుందని తెలియచేసారు. కార్యక్రమాన్ని ఇంటర్ బోర్డు ప్రధాన కార్యాలయం నుండి పరీక్షల నియంత్రణ అధికారి వివి.సుబ్బారావు పర్యవేక్షించారు. తిరిగి అన్ని యాజమాన్యాల కళాశాలలకు మరోసారి ఈ శిక్షణా తరగతులను ఇంటర్ బోర్డు ఏర్పాటు చేస్తారన్నారు. రెండో విడత శిక్షణ కార్యక్రమంలో జిల్లాలోని ప్రైవేట్, అన్‌ఎయిడెడ్, జనరల్ ఒకేషనల్ జూనియర్ కళాశాలల యాజమాన్యాల నుంచి 208 మంది అధ్యాపకులు హాజరయ్యారు.

యథేచ్ఛగా మట్టి తవ్వకాలు

పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి-భట్టిప్రోలు

ఒక సీజన్ అంటూ లేకుండా గత నాలు గేళ్లుగా ప్రతి ఏటా భట్టిప్రోలు మండలం పల్లె కోన గ్రామంలో యథేచ్ఛగా అక్రమంగా మట్టి తవ్వకాలను అక్రమార్కులు కొనసాగిస్తూనే ఉన్నారు. పంట భూములను చెరువులుగా చేస్తూ ఆ మట్టిని భట్టిప్రోలు, రేపల్లె తదితర ప్రాంతాలకు తరలిస్తూ ఉంటారు. మట్టిని తవ్వేందుకు తప్పనిసరిగా మైనింగ్ శాఖ, రెవె న్యూ శాఖ, పంచాయతీ అనుమతి పొందాల్సి ఉంది. కానీ అలాంటి ఏ శాఖ ద్వారా ఎలాంటి అనుమతులు లేకుండానే అధికార పార్టీని అడ్డం పెట్టుకొని ఆ గ్రామ సర్పంచి నిత్యం జెసిపిలతో సుమారు పది అడుగుల లోతు వరకు మట్టిని తీసి ట్రాక్టర్లు, డంపర్ లారీల ద్వారా తరలిస్తు



అక్రమంగా తరలుతున్న మట్టి

న్నారు. సుమారు 20 టన్నులకు పైగా బరువు ఉండే డంపర్ లారీలు తిరగటంతో రహదా రులు సైతం పూర్తిగా దెబ్బతిని ప్రజల ప్రయా ణానికి తీవ్ర ఆటంకంగా మారాయి. వైసిపి ప్రభుత్వం రహదారులపై నిర్లక్ష్యం వహించడం తో ఇప్పటికే పెద్ద పెద్ద గుంటలు ఏర్పడి దెబ్బతినగా దీనిపై మట్టి లారీలు తిరగటం వల్ల మరింత రాకపోకలకు అంతరాయంగా ఏర్పడిం దని ఆ ప్రాంతవాసులు ఆందోళన వ్యక్తం చేస్తు న్నారు. గ్రామంలో అధికార పార్టీ నాయకుల అండదండలతో సర్పంచి దగ్గరుండి మరీ ఈ తవ్వకాలను చేపట్టి లక్షలాది రూపాయలు అక్రమార్జన చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. అక్రమ తవ్వకాలపై కొరడా ఝుళిపించాల్సిన అధికారులు సైతం మామూళ్లు పుచ్చుకొని మిన్నకుండిపోతున్నారనే విమర్శలున్నాయి.

'చందూ డ్యాన్స్' విద్యార్థులకు జాతీయ అవార్డులు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ఈ నెల 21 నుండి 24 వరకు చిలకలూరిపేటలో జరిగిన కళానిలయం సంస్థ వారు నిర్వహించిన జాతీయస్థాయి నృత్య పోటీల్లో చందూ డ్యాన్స్ అకాడమీ విద్యార్థులు అత్యధికంగా 13 అవార్డు లను సాధించిందటం చాలా సంతోషం గా ఉందంటూ నాగభైరవ సాహిత్య పీఠం అధ్యక్షులు డాక్టర్ నాగభైరవ ఆదినారాయణ తెలిపారు. ఈ సందర్భంగా అకాడమీ విద్యార్థులకు అభినందన కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. కళామిత్ర మండలి జాతీయ సంస్థ అధ్యక్షులు డాక్టర్ నూనె అంకమ్మరావు మాట్లాడుతూ గత కొన్ని సంవ త్సరాలుగా చందూ డ్యాన్స్ అకాడమీ చిన్నారులు



అవార్డులతో విద్యార్థులు

అనేక రకాల పోటీల్లో గెలుపొందినట్లే ఈ సంవత్సరం కూడా బహుమతులను సాధించటం గొప్ప విషయం అని పేర్కొన్నారు. నత్య దర్శకుడు టి.చందూను, పిల్లలను అభినందించారు. కార్యక్రమంలో కోవెలకుంట్ల బాలకోటయ్య పాల్గొన్నారు.

సృజనాత్మకతను వెలికితీసేందుకే సమ్మర్ క్యాంపులు

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

పిల్లల్లో దాగివున్నసృజనాత్మకతను వెలికి తీసేందుకే సమ్మర్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు పలువురు వక్తలు తెలిపారు. స్థానికచైతన్య నగర్ లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రం లో ఒంగోలు చిల్డ్రన్ క్లబ్ ఆధ్వర్యంలో పిల్లలకు ఐదు రోజులు సమ్మర్ క్యాంపు నిర్వహించారు. డ్రాయింగు, దేశ భక్తి పాటలు, ఆటలు, డ్యాన్స్ తదితర కళలలో శిక్షణ ఇచ్చారు . ఆదివారం చివరగా ముగింపు సభ జరిపారు. సభకు ప్రజానాట్యమండలి నగర కార్యదర్శి పి ఇంద్రజ్యోతి అధ్యక్షత వహించారు. ఒంగోలు నగరాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు



విద్యార్థులకు నోట్‌పుస్తకాలు అందజేస్తున్న నాయకులు

మారెళ్ళసుబ్బారావు, ఐద్వా నగర కార్యదర్శి జి ఆదిలక్ష్మి, కావూరు ఉద్యమ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పిల్లల్లో సృజనాత్మక శక్తిని వెలికి తీసి వారిని అభివృద్ధి చేయాలనే ఉద్దేశంతో సమ్మర్ క్యాంపు నిర్వహించామన్నారు. క్యాంపులో పాల్గొన్న పిల్లలు చక్కగా బొమ్మలు గీశారు. పాటలు పాడారు.ఆటలు ఆడారు. పిల్లలు మంచి మార్గంలో నడవడానికి తల్లిదండ్రులు ఈ క్యాంప్ ను భవిష్యత్తులో కూడా ఉపయోగించుకోవాలని కార్యక్రమంలో పాల్గొన్న నిర్వాహకులు కోరారు.మారెళ్ల సుబ్బారావు సౌజన్యంతో పిల్లలకు ఫ్యాడ్స్ ,పెన్నులు నోటు పుస్తకాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు జి రమేష్, దారా వెంకటేశ్వర్లు, ఆర్.పెంచల కొండయ్య, సిహెచ్ రామారావు, అనిత, దారా తిరుపతమ్మ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులతో పుస్తక పఠనం

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

జిల్లా కేంద్ర గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా ఆదివారం జిల్లా కేంద్ర గ్రంథాలయంలో పలు కార్యక్రమాలు నిర్వహిం చారు. సిహెచ్.సుధాకర్‌రావు పిల్లలతో పుస్తక పఠనం చేయించారు. యస్.షిర్డీ సాయిరాం గణితంలో లాజిక్ ఫజిల్స్ నేర్పించారు. దాసరి లక్ష్మిప్రసాద్, ఉపాధ్యాయులు మరియు జనవిజ్ఞానవేదిక అధ్యక్షులు స్పేర్ టైం యాక్టివిటీస్‌లో విద్యార్థులతో విడివిడిగా స్కిట్స్ ప్రాక్టీస్ చేయించారు. కవి జాలాది మోహన్ స్పోకెన్ ఇంగ్లీష్‌పై అవగాహన కల్పించారు. సాఫ్ట్‌వేర్ ఉద్యోగి నందిపాటి రవికాంత్ పిల్లలకు స్నాక్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారికి ఉపగ్రంథపాలకురాలు బొమ్మల కోటేశ్వరి ధన్యవాదాలు తెలిపారు.



వేసవి శిక్షణ శిబిరంలో పాల్గొన్న విద్యార్థులు

● విరబూసిన 'మే' పుష్పం



ప్రతి ఏటా మే నెలలో మాత్రమే పూసే 'మే' పుష్పం.. భట్టిప్రోలు విఠలేశ్వర నగర్‌లోని గొట్టుముక్కల లక్ష్మి నివాస గహంలో విరబూసింది. గత ఏడాది వర్షాభావ కారణంగా ఈ పుష్పం జూన్ నెలలో విరబూయగా ఈ ఏడాది మే నెలలోనే వరుసగా వర్షాలు కురుస్తుండటంతో విరబూసినట్లు లక్ష్మీ తెలిపారు. ఈ పుష్పాన్ని గ్రామంలోని ప్రజలు ఆసక్తిగా వీక్షిస్తున్నారు.

- ప్రజాశక్తి, భట్టిప్రోలు

గర్భిణులు, గర్భస్థ శిశువుల

ఆరోగ్య పరిరక్షణే లక్ష్యం

- పూర్తి స్థాయి వైద్యసేవలు అందించేందుకు ప్రత్యేక చర్యలు
- డిఎంహెచ్ఓ విజయమ్మ

ప్రజాశక్తి-బాపట్ల

గర్భిణులు, గర్భస్థ శిశువు సంపూర్ణ ఆరోగ్య పరిరక్షణే లక్ష్యంగా పూర్తిస్థాయి వైద్య సేవలందించేందుకు వైద్యారోగ్య శాఖ ప్రత్యేక చర్యలు చేపట్టిందని జిల్లా వైద్య ఆరోగ్య అధికారి ఎస్.విజయమ్మ తెలిపారు. గర్భవతుల ఆరోగ్య సేవలపై ఆమె 'ప్రజాశక్తి'తో ముఖాముఖి మాట్లాడారు. గర్భవతుల ఆరోగ్య పరిరక్షణకు అత్యవసర పరిస్థితుల్లో ఆసుపత్రికి చేర్చేందుకు 102 సేవలను వినియోగించుకోవచ్చన్నారు. గర్భిణీలు తీసుకోవాల్సిన పౌష్టికాహారం, మాన సిక ఒత్తిడి, శారీరక సమస్యలపై ఇతర జాగ్రత్త లపై సమగ్ర సమాచారాన్ని తెలియజేసేందుకు కిల్ క్యారీ ద్వారా సమాచారాన్ని గర్భవతులకు అందజేసేందుకు వైద్యారోగ్య శాఖ కాల్ సెంటర్ ద్వారా 01244451660 నెంబర్ నుండి గర్భవతులుగా నమోదైన వారి సెల్ ఫోన్ నెంబర్లకు ఈ నెంబర్ నుండి ఫోన్ ద్వారా గర్భవతులు పౌష్టికాహారం తీసుకోవాల్సిన సమయపాలన ఆహార నియమాలు, గర్భస్థ శిశువు ఆరోగ్య రక్షణ పై సమాచారాన్ని తెలియజేస్తారన్నారు. ఈ నెంబర్ నుండి ఫోన్ కాల్ ను గర్భవతులు స్వీకరించకపోతే తిరిగి 14423 నెంబర్‌కు ఫోన్ చేసి.. గర్భిణులు అవసరమైన సలహాలు, సూచనలను అడిగి తెలుసుకోవచ్చన్నారు. గర్భిణులకు ప్రత్యేకంగా తల్లి, బిడ్డ సంరక్షణకు మొదటి కాన్పుకు రూ.6 వేలు, రెండో కాన్పుకు రూ.5 వేలు, తల్లి బిడ్డ సంరక్షణకు వైద్యారోగ్య శాఖ అందజేస్తుందన్నారు. ఈ నగదు మొత్తాన్ని గర్భిణులకు సంబంధించి తెల్ల రేషన్ కార్డు గానీ లేక ఆరోగ్యశ్రీ కార్డు, బ్యాంకు ఎకౌంటు కలిగి ఉండాలన్నారు. వైద్య, ఆరోగ్యశాఖ అందించే



నగదు గర్భిణీల బ్యాంక్ ఖాతాలో జమ చేయడం జరుగుతుందన్నారు. జిల్లాలో 43 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 8 సామాజిక ఆరోగ్య కేంద్రాలు, రెండు ఏరియా వైద్యశాల్లో గర్భిణులు, బాలింతలకు అవసరమైన ప్రత్యేక వైద్య సేవలు అందిస్తారన్నారు. వాతావరణ పరిస్థితులకనుగుణంగా గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఎప్పటికప్పుడు కిల్ క్యారీ ఫోన్ ద్వారా తెలియజేయడం జరుగుతుందన్నారు. వీటితోపాటు మరో 12 పట్టణ ఆరోగ్య కేంద్రాలు జిల్లాలో ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్నాయన్నారు. ప్రత్యేకంగా ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రాల్లో 66 రకాల వైద్య పరీక్షలు నిర్వహిస్తారన్నారు. జిల్లాలో 32 మందికి కొత్తగా కుష్టు వ్యాధి లక్షణాలు ఉన్నట్టు గుర్తించడం జరిగిందన్నారు. వీరితో పాటు గతంలో నిర్వహించిన సర్వేలో 73 మందికి కుష్టు వ్యాధి లక్షణాలు ఉన్నాయన్నారు. వీరికి శారీరక అవయవాల పరిస్థితుల దష్ట్యా అవసరమైన వారికి తెనాలి మండలం మోరంపూడి లో స్వచ్ఛంద సేవా సంస్థ ద్వారా అవయవాలకు సర్జరీ చేసే ప్రక్రియ ఉందన్నారు. ఈ జనవరి నుండి ఇప్పటివరకు 665 మంది క్షయ వ్యాధిగ్రస్తులను గుర్తించి వారికి ఔషధాలు పౌష్టికాహారానికి సంబంధించి ప్రతినెలా రేషన్ దుకాణాల ద్వారా రేషన్ అందజేయడం జరుగుతుందన్నారు. దీంతో పాటు మరో రూ.500 నగదును అందజేయడం జరుగుతుందన్నారు. జిల్లాలో డెంగ్యూ వ్యాధి నివారణకు పరిసరాల పరిశుభ్రతపై ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నామన్నారు. సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. వర్షాల తరుణం ఆరంభం కానున్న నేపథ్యంలో ప్రజలు కాచి చల్లార్చిన నీటిని తాగాలన్నారు. ప్రజలకు ఆరోగ్య సమస్యలు తలెత్తితే దగ్గరలోని ప్రాథమిక వైద్య, ఆరోగ్య కేంద్రాల్లో తక్షణమే వైద్యులను సంప్రదించి తగిన వైద్యసేవలు పొందాలన్నారు. మారుతున్న వాతావరణం పరిస్థితుల దష్ట్యా ప్రజలు అనారోగ్యం బారిన పడకుండా అత్యంత జాగ్రత్తలు తీసుకోవాలని ఆమె సూచించారు. నాన్-కమ్యూనికేషన్ వ్యాధులు గుండె జబ్బులు, క్యాన్సర్, మధుమేహం దీర్ఘకాలిక ఊపిరితిత్తుల వ్యాధులను గుర్తించి వారికి ప్రత్యేక వైద్య సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు జిల్లాలో దీనిపై వైద్య ఆరోగ్య సిబ్బంది అవసరమైన పరీక్షలు నిర్వహిస్తున్నారు. బాల్యవివాహాలను అరికట్టేందుకు జిల్లా వ్యాప్తంగా వైద్య ఆరోగ్య సిబ్బంది, స్వచ్ఛంద సంస్థలు, ఇతర ప్రభుత్వ అధికారులతో టీంల ఏర్పాటుతో క్షేత్రస్థాయిలో బాల్యవివాహాలను అరికట్టేందుకు కషి జరుగుతుందన్నారు. ప్రజలు ప్రభుత్వ వైద్య, ఆరోగ్య సేవలు వినియోగించుకొని సంపూర్ణ ఆరోగ్యంతో జీవనం సాగించాలన్నారు.